జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి సోమవారం 6 జనవరి 2025 సంపుటి : 15 సంచిక : 284 వెల: రూ.5 పేజీలు: 08 RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# ఎమ్మెల్యేలకు సర్వే టెన్షన్

- టీడీపీ ఎమ్మెల్యేల ఆరు నెలల పని తీరు ఎలా ఉందో తెలుసుకోవడంపై ఫోకస్
- చంద్రబాబు..ఎప్పుడు అధికారంలో ఉన్నా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరి పనితీరుపై ఆరా తీస్తూనే ఉంటారు.
- గత ప్రభుత్వం లాగా ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఊరుకునేది లేదని చంద్రబాబు వార్నింగ్ ఇస్తున్నారు
- నాయకులు నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాబులో ఉండాల్సిందేనని అన్నారు.
- మంత్రుల పనితీరు సరిగా లేదని సీఎం ప్రధాన ఆరోపణ.



**విజయవాడ**

చంద్రబాబు.. సీఎం మాత్రమే కాదు.. ఓ సీఈఓ అని చాలా మంది చెబుతూ ఉంటారు. ఆయన ఎప్పుడు అధికారంలో ఉన్నా అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అందరి పనితీరుపై ఆరా తీస్తూనే ఉంటారు. వారి పనిలో ప్రొగ్రెస్ గురించి నిత్యం తెలుసుకుంటూనే ఉంటారు. ప్రజెంట్ ఆయన టీడీపీ ఎమ్మెల్యేల ఆరు నెలల పని తీరు ఎలా ఉందో తెలుసుకోవడంపై ఫోకస్ చేశారు. ప్రజలకు ఎంఖీూ కాల్స్ చేసి ఎమ్మెల్యేలు ఎంత వరకు అందుబాటులో ఉంటున్నారో తెలుసుకుంటున్నారు. పనితీరు బాగుంటే ఒకటి .. పర్వాలేదు అనిపిస్తే రెండు .. బాగోకపోతే మూడు ప్రెస్ చెయ్యాలని కోరుతూ ప్రజలకు కాల్స్ వెళ్తున్నాయి. పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం నుంచి ఈ సర్వే మొదలైంది. గత ప్రభుత్వం లాగా ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఊరుకునేది లేదని చంద్రబాబు వార్నింగ్ ఇస్తున్నారు. నాయకులు నిత్యం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాబులో ఉండాల్సిందేనని అన్నారు. గతంలో టికెట్ ఇచ్చే సమయంలోనే చంద్రబాబు ఈ కాల్స్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేశారు. ఇప్పుడు ప్రజల నుంచి, కార్యకర్తల నుంచి పాజిటివ్ ఫీడ్ బ్యాక్ రావాల్సిందేనని ఆయన తేల్చి చెప్పారు. దీంతో సర్వేల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయో అని - మిగతా3లో



### గత ప్రభుత్వం తప్పిదం వల్లే

# జైల్లో ఈ పరిస్థితి

- విశాఖ సెంట్రల్ జైల్లో గంజాయి
- హెూం మంత్రి అనిత తనిఖీలో గుర్తింపు
- గత ప్రభుత్వం తప్పిదం వల్లే జైల్లో ఈ పరిస్థితి
- త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం
- హెూం మంత్రి వంగలపూడి అనిత వెల్లడి

**విశాఖ:**

రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనిత ఆదివారం ఉదయం విశాఖ సెంట్రల్ జైల్‌ను సందర్శించారు. జైల్లో ప్రస్తుత పరిస్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెూంమంత్రి మాట్లాడుతూ.. విశాఖ సెంట్రల్ జైల్లో గంజాయి సరఫరా ఆరోపణలు వచ్చాయని, పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తప్పిదాల వలనే విశాఖ సెంట్రల్ జైల్లో ఇలాంటి పరిస్థితి వచ్చిందని, ఖైదీల రక్షణే ముఖ్యమని అన్నారు. ఇటీవలే జైల్లో సెల్ ఫోన్లు బయటపడ్డాయని, సెల్ ఫోన్లు బయటపడిన చోట కూడా - మిగతా3లో

# కమలానికి సేనాని ఎవరు?

- సంక్రాంతి తర్వాత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడ్ని ప్రకటించాలనే ఆలోచన చేస్తోంది హైకమాండ్.
- సెకండ్ వీక్‌లో కొత్త అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలని భావిస్తోంది.
- అధ్యక్ష పీఠం కోసం నలుగురు నేతలు పోటీపడుతున్నారు
- దక్షిణాదిలో తన ఉనికి మరింత పెంచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ హైకమాండ్
- పార్టీలో బలమైన ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడి కోసం వెతుకుతోంది.



**విజయవాడ**

బీజేపీలో దేశవ్యాప్తంగా సంస్థాగత ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. జనవరి మొదటి వారానికి ఈ అంకం ముగియనుంది. సెకండ్ వీక్‌లో కొత్త అధ్యక్షుడ్ని ఎంపిక చేయాలని భావిస్తోంది. సంక్రాంతి తర్వాత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడ్ని ప్రకటించాలనే ఆలోచన చేస్తోంది హైకమాండ్. అధ్యక్ష పీఠం కోసం నలుగురు నేతలు పోటీపడుతున్నారుదక్షిణాదిలో తన ఉనికి మరింత పెంచుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ హైకమాండ్. పార్టీలో బలమైన ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడి కోసం వెతుకుతోంది. - మిగతా3లో



## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి

- దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయే
- మనం 2025 సంవత్సరంలో ఉన్నాం
- 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయి..
- శతాబ్దంలో పావు సంవత్సరం ముగిసిపోయింది
- రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకం
- ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుంది
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

# ప్రధాని పర్యటన రాష్ట్రానికి ఎంతో కీలకం


- 8న ప్రధాని పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి
- విశాఖ లో సమీక్షించిన మంత్రి లోకేష్




**విశాఖపట్నం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 8న విశాఖ పర్యటనను దృష్టిలో ఉంచుకొని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం విశాఖలోని కలెక్టరేట్ లో అధికారులతో సమీక్షించారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి సారిగా ప్రధాని ఏపీ వస్తున్నారని, ఇదొక చరిత్రాత్మక పర్యటన అని పేర్కొన్నారు. అందరూ సింగిల్ ఏజెండాతో పనిచేయాలని, గతంలో ఎన్నడూ జరగని విధంగా ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు అధికారులు, కూటమి నేతలు బాధ్యతలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించి విశాఖ కలెక్టరేట్ లో ఉన్నతాధికా రులు, కూటమి ప్రజాప్రతినిధులతో మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా - మిగతా3లో

# ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటాం



- మన ఆలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేది
- ఐసుగడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయి
- ఆలయాల సంరక్షణపై హైందవ సంఘాల డిక్లరేషన్
- విజయవాడలో హైందవ శంఖారావం సభ...
- డిక్లరేషన్ ప్రకటించిన వీహెచ్ పీ
- వీహెచ్ పీ ఆధ్వర్యంలో కేసరపల్లి వద్ద భారీ ఎత్తున హిందూ సభ
- లక్షలాదిగా తరలివచ్చిన ప్రజలు
- హాజరైన చినజీయర్ స్వామి, గణపతి సచ్చిదానంద స్వామి తదితరులు

## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

ఓయో సంచలన నిర్ణయం.. రూమ్ బుక్ చేసుకునే సమయంలో తమ రిలేషన్‌షిప్‌ను నిర్ధారించే ఐడీ ప్రూఫ్‌ను సమర్పించాలి



## ఒక్క చాన్స్ ప్లీజ్...

# నామినేటెడ్ ఎమ్మెల్సీల కోసం జోరుగా ప్రయత్నాలు

**బెంగళూరు:** విధానపరిషత్‌కు నామినేటెడ్ విధానంతో నలుగురిని ఎంపిక చేసేందుకు వీలున్నందున ఆశావాహులు తీవ్రస్థాయిలో లాబీ చేస్తున్నారు. సభ్యులు యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్‌ల పదవీకాలం ముగిసింది. చెన్నపట్టణ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన సీపీ యోగేశ్వర్ బీజేపీ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 27న జేడీఎస్ సభ్యుడు తిప్పేస్వామి పరిషత్ పదవీకాలం ముగియనుంది. ఇలా నాలుగు స్థానాలకు ఖాళీ ఏర్పడగా, కాంగ్రెస్ నుంచి ఎంపిక చేసే వెసలుబాటు ఉంది. అయితే ఆ స్థానాలకు ఏకంగా 20 మంది దాకా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. యూబీ వెంకటేష్, ప్రకాష్ రాథోడ్ మరోసారి అవకాశం కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ సభాపతి బీఎల్ శంకర్, మాజీ మంత్రి రాణి సతీషలు ఇప్పటికే సీఎంను కలిసి అవకాశం కోరినట్లు తెలుస్తోంది. నలుగురిని భర్తీ చేయాల్సి ఉన్నందున డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయంతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేను సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు ఇటు సీఎం, డీసీఎంలతోనే కాకుండా ఢిల్లీలో ఖర్గేతో పాటు ఇతర నేతల ద్వారా కూడా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నెలాఖరులోగానే నలుగురిని ఎంపిక చేయడం ద్వారా పరిషత్‌లో ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల నాటికి బలం పెంచుకోదలచారు. నలుగురిని ఎంపిక చేయాలంటే సీఎం, డీసీఎంలు ఒక నిర్ణయానికి వచ్చిన తర్వాత అధిష్టానం ఆమోదం కూడా లభించాల్సి ఉంటుంది.



## ఇకపై లవర్స్‌కు నో రూమ్స్!

పెళ్లికి ముందే ప్రైవసీ కోసం ఎక్కువమంది ఎంచుకునే ఆప్షన్ ఓయో రూమ్స్. వివాహంతో సంబంధం లేకుండా పరస్పర అంగీకారంతో శారీరక సంబంధం కలిగిన వ్యక్తులు ఒయో రూమ్స్‌కు వెళ్తుంటారు. స్త్రీ, పురుషుల గుర్తింపు కార్డు చూపించి, టారిఫ్ చెల్లిస్తే ఎటువంటి అభ్యంతరం చెప్పకుండా రూమ్స్ కేటాయిస్తారు. ఎక్కువమంది కాలేజీ అబ్బాయిలు, అమ్మాయిలు ఓయో సర్వీసెస్ ఉపయోగించుకుం టున్నారు. కొందరు ఓయో సర్వీసెస్‌ను తప్పుపడుతున్నారు. తమ పిల్లలు చెడిపోవడానికి ఇవి కారణమవుతున్నాయని విమర్శించేవాళ్లు ఉన్నారు. గత కొన్నేళ్లుగా ఓయో హాస్పిటాలిటీ సేవలను అందిస్తోంది. తక్కువ ధరకే రూమ్స్ అందించడంతో ఓయో సర్వీసెస్ తక్కువకాలంలో అందరినీ ఆకర్షించాయి. అదే సమయంలో కపుల్స్ కాకపోయినా పరస్పర అంగీకారంతో అమ్మాయి, అబ్బాయి ఒకే రూమ్‌లో ఉండేందుకుఓయో హెూటల్స్ అనుమతిస్తుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న ఘటనల దృష్ట్యా ఓయో హెూటల్స్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది.

**వారికి నో ఎంట్రీ..**

ఓయో హెూటల్స్‌లో రూమ్ బుక్ చేసుకోవడం ఎంతో ఈజీ. ఓయో యాప్‌లో రూమ్ బుక్ చేసుకుని, నేరుగా హెూటల్‌కు వెళ్తే గది కేటాయిస్తారు. రూమ్‌లో ఉండే వ్యక్తుల గుర్తింపు కార్డు జిరాక్స్ హెూటల్ రిసెప్షన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. అంతేతప్ప మిగిలిన ఏ వివరాలు అడగరు. ముఖ్యంగా ప్రైవసీ కోరుకునేవారికి ఓయో రూమ్స్ అనువైన ప్రదేశంగా చెబుతారు. ఇప్పటివరకు ఎవరైనాఓయోలో రూమ్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉండగా.. తాజాగా ఒయో పెళ్లి కాని జంటలకు రూమ్స్ ఇవ్వబోమనే కొత్త రూల్ తీసుకొచ్చింది. ఓయో తీసుకొచ్చిన నూతన చెక్ ఇన్ పాలసీలో పెళ్లి కాని జంటలు రూమ్‌ను బుక్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ నిబంధనలను తొలుత ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అమలు చేస్తోంది. ఆ తర్వాత ఈ విధానాన్ని దేశమంతా విస్తరించే ఛాన్స్ ఉంది. ఇకనుంచి రూమ్ బుకింగ్ సమయంలో జంటలు తమ పెళ్లిని నిర్ధారించే గుర్తింపు కార్డును సమర్పించాలి. సురక్షితమైన, బాధ్యతాయుతమైన హాస్పిటాలిటీకి తాము కట్టుబడి ఉన్నామని ఓయో నార్త్ ఇండియా హెడ్ పవాస్ శర్మ తెలిపారు.

**గుర్తింపు చూపిస్తే..**

ఎవరైనా జంటలు ఓయోలో రూమ్స్ బుక్ చేసుకోవాలంటే వివాహ ధృవీకరణ లేదా, కపుల్స్‌గా ధృవీకరించే ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. గతంలో వలె రూమ్స్ బుక్ చేసుకునే విధానంలో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. ఓయో నిర్ణయాన్ని కొందరు స్వాగతిస్తుండగా.. ప్రేమికులకు మాత్రం ఇది షాకింగ్ అనే చెప్పుకోవాలి. జంటగా ధృవీకరించే పత్రాలు బుకింగ్ సమయంలో సమర్పించకపోతే వారికి రూమ్ బుక్ కాదనే చెప్పుకోవాలి.

## పూరీలోని జగన్నాథ ఆలయంపై ఎగిరిన డ్రోన్..

# కలకలం రేపిన ఘటన


**భువనేశ్వర్:** ఒడిశాలోని పూరీలో ఉన్న ప్రసిద్ధ జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. సుమారు అరగంట పాటు అక్కడ తిరిగింది. దీంతో ఈ సంఘటన కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆదివారం ఉదయం తెల్లవారుజామున 4.10 గంటల సమయంలో పూరీలోని జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగిరింది. దానికి అమర్చిన కెమెరాలో ఆలయాన్ని చిత్రీకరించింది. కాగా, నో ఫ్లైయింగ్ జోన్ ప్రాంతమైన జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురడం కలకలం రేపింది.



భద్రతా లోపాలపై ఆందోళనకు దారి తీసింది. న్యాయ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఈ సంఘటనపై స్పందించారు. జగన్నాథ ఆలయంపై డ్రోన్ ఎగురవేయడం చట్టవిరుద్ధమని, ఆమోదయోగ్యం కాదని అన్నారు. భద్రతా ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఆలయం చుట్టూ ఉన్న నాలుగు వాచ్‌టవర్ల వద్ద 24 గంటలపాటు పోలీస్ సిబ్బందిని మోహరించే చర్యలు చేపడతామని అన్నారు. మరోవైపు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పూరీ ఎస్పీ వెల్లడించారు. ఎవరో యూట్యూబర్ ఈ చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

## ఒకసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం కష్టం..

# జోహెూ సీఈఓ హెచ్చరిక



**ఇంటర్నెట్ డెస్క్:** జనాభా తగ్గుదల ఒక్కసారి మొదలైతే పరిస్థితిని చక్కదిద్దడం చాలా కష్టమని జోహెూ కార్పొరేషన్ సంస్థ సీఈఓ శ్రీధర్ వెంబు తాజాగా హెచ్చరించారు. చైనా, జపాన్‌లోని పరిస్థితులను ఇందుకు తాజా ఉదాహరణగా పేర్కొన్నారు. "1990ల్లో జపాన్ సాంకేతికంగా ఉచ్ఛస్థితికి చేరుకుంది. అమెరికాను కూడా చైనా మించిపోనుందని అప్పట్లో జనాలు చెప్పుకునేవారు. కానీ ఇప్పుడేమైందీ.. అక్కడి జనాభా తగ్గిపోవడంతో కొత్త సమస్యలు ప్రారంభమవుతున్నాయి" అని ఆయన తాజాగా ట్వీట్ చేశారు. ప్రస్తుతం చైనాలో కూడా దాదాపు ఇదే పరిస్థితి పునరావృతమవుతోం దని అన్నారు దేశాల్లో పారిశ్రామీకరణ, నగరీకరణ జరుగుతున్న తీసుకునే నిర్ణయాలు, సంస్కృతి సంప్రదాయాలు కనుమరుగవుతుండటం, చిన్న కుటుంబాల సంఖ్య పెరగడం తదితరాలు జనాభా తగ్గుదలకు దారి తీస్తాయని శ్రీధర్ వెంబు చెప్పారు. "ఒక్కసారి జనాభా తగ్గుదల మొదలైతే దాన్ని అడ్డుకోవడం చాలా కష్టం. నాకు తెలిసి ఈ పరిస్థితి అడ్డుకున్న దేశం ఒక్కటి కూడా లేదు. అందుకే నేను గ్రామీణ జీవనానికి, మన సంప్రదాయాలవైపు మొగ్గు చూపుతాను" అని ఆయన అన్నారు. జంటలను పిల్లల్ని కనేలా ప్రోత్సహించే అభివృద్ధి విధానాలకే తన మద్దతు అని స్పష్టం చేశారు. మిగతావేటికీ ఇంత ప్రాముఖ్యత లేదని స్పష్టం చేశారు. భారత జనాభాలో మార్పులపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో జోహెూ సీఈఓ వ్యాఖ్యలు మరోసారి నెట్టింట ట్రెండింగ్‌లోకి వచ్చాయి. జనాభా స్థిరీకరణకు సంతానోత్పత్తి రేటు 2.1 కాగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే ఈ రేటు 1.6కి చేరుకుంది. దీంతో, జనాభాలో వృద్ధుల సంఖ్య పెరిగి దేశంపై భారం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. గతేడాది నవంబర్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా తగ్గుదలతో ప్రమాదాలపై కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. జనాభాలో ప్రతికూల మార్పులను అడ్డుకునేందుకు తక్షణ చర్యలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

## భారీ బోర్డింగ్ పాస్ చూపించిన వ్యక్తి..
## ఎయిర్‌పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది ఏం చేశాడంటే?





**న్యూఢిల్లీ:** ఒక విమాన ప్రయాణికుడు విభిన్నంగా వ్యవహరించాడు. బోర్డింగ్ పాస్‌ను పెద్ద పేపర్‌పై ప్రింట్ తీశాడు. ఎయిర్‌పోర్ట్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి దీనిని చూపించాడు. ఇది చూసి అతడు షాక్ అయ్యాడు. అందులోని వివరాలు పరిశీలించేందుకు కాస్త ఇబ్బంది పడ్డాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విమానంలో ప్రయాణించేందుకు ఒక వ్యక్తి ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నాడు. గేట్ వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి భారీ సైజులో ప్రింట్ చేసిన బోర్డింగ్ పాస్‌ను రెండు చేతుల్లో పట్టుకుని చూపించాడు. ఇది చూసి ఆ సెక్యూరిటీ అధికారి అయోమయం చెందారు. పెద్ద పేపర్‌పై ప్రింట్ చేసిన టిక్కెట్ వివరాలను సరిచూసుకునేందుకు కాస్త ఇబ్బందిపడ్డారు. బోర్డింగ్ పాస్‌ను ఇలా ప్రింట్ చేయాలని నీ స్నేహితులకు చెప్పవద్దని నవ్వుతూ అన్నారు. కాగా, ఈ వీడియో క్లిప్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. 'వారు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారేమో' అని క్యాప్షన్ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. నెటిజన్లు కూడా ఫన్నీగా స్పందించారు. ఫ్రాంక్ చేసేందుకు లేదా సోషల్ మీడియాలో ప్రమోట్ అయ్యేందుకు ఆ వ్యక్తి ఇలా చేసి ఉంటాడని కొందరు పేర్కొన్నారు. మరోవైపు ట్రావెల్ కంపెనీ మేక్‌మైట్రిప్ కూడా ఈ వీడియో క్లిప్‌పై స్పందించింది. పేపర్‌ను సేవ్ చేయాలని సూచించింది. తమ ద్వారా కొనుగోలు చేసిన విమాన టిక్కెట్లను వాట్సాప్‌లో కూడా చూపించవచ్చని పేర్కొంది. మీ ప్రయాణం కంటే మీ జీవితం, అభిరుచి పెద్దవని ప్రశంసించింది.

## జేడీఎస్ నిర్వీర్యానికే.. ఆపరేషన్ హస్త కుట్ర

ప్రలోభ పెట్టినట్లు ఎమ్మెల్యేలు స్వయంగా చెప్పారు..

12 మందిని పార్టీ మార్చే ప్రయత్నాలు జరిగాయి

కేంద్రమంత్రి కుమారస్వామి సంచలన ఆరోపణ



**బెంగళూరు:** జేడీఎస్ పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకే ఆపరేషన్ హస్త కుట్ర పన్నారని కేంద్రమంత్రి కుమారస్వామి సంచలనమైన ఆరోపణలు చేశారు. బెంగళూరులో కుమారస్వామి మీడియాతో మాట్లాడుతూ జేడీఎస్ పార్టీకి చెందిన 12-13 మంది ఎమ్మెల్యేలను పార్టీ మార్పించే ప్రయత్నాలు జరిగాయన్నారు. అయితే జేడీఎస్ ఎమ్మెల్యేలను మార్పు చేయడం అంత సులువు కాదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాపాలు పెరిగాయన్నారు. తమ ఎమ్మెల్యేలు తనకు పూర్తి సమాచారం అందించారన్నారు. సంక్రాంతి ముగిసే దాకా ఏమీ మాట్లాడేది లేదన్నారు. జేడీఎస్ ఇటువంటి కుట్రలకు భయపడేది లేదని, జేడీఎసను ఎప్పటికీ నిర్వీర్యం చేయలేరన్నారు. దేవుడే కాంగ్రెస్‌కు తగిన శిక్ష వేస్తారన్నారు. దేశంలో గ్యారెంటీలకు పోటీ పడుతున్నారన్నారు. తొలుత అమలు చేసిన హిమాచల్ ప్రదేశ్ పరిస్థితి ఏం జరిగిందో తెలిసిందేనన్నారు. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితి ఉందో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గ్రాంట్ల కోసం ఎన్ని తంటాలు పడుతున్నారో అందరికీ తెలుసన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఆత్మాభిమానం ఉంటే ప్రభుత్వం ఏదిశగా వెళుతుందో దృష్టి సారించాలన్నారు. మైసూరులో ప్రిన్సస్(మహారాణి) పేరుతో ఉండే రోడ్డుకు సిద్దరామయ్య పేరు పెట్టాలనే ప్రస్తావనపై ఆయన ఎద్దేవా చేశారు. కర్ణాటకకే సిద్దరామయ్య పేరు పెడితే బాగుంటుందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ సీనియర్ నేత జీటీ దేవెగౌడతో తనతో భార్యాభర్తల సంబంధమన్నారు. ఎన్నోసార్లు గొడవలు జరుగుతాయని ఆతర్వాత సమిసిపోతాయన్నారు.

## బీజేపీకి ఒక్క ఛాన్స్ ఇవ్వండి



**న్యూఢిల్లీ:** ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని ఢిల్లీ ప్రజలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. దేశ రాజధానిని అభివృద్ధి చేయగలిగే పార్టీ ఒక్క బీజేపీయేనని అన్నారు. రోహిణిలో ఆదివారంనాడు జరిగిన 'బీజేపీ పరివర్తన యాత్ర'లో ఆయన మాట్లాడుతూ, మనం 2025 సంవత్సరంలో ఉన్నామని, 21వ శతాబ్దంలో 25 ఏళ్లు గడిచిపోయాయని, శతాబ్దంలో పావు సంవత్సరం ముసిగిపోయిందని అన్నారు. ఈ 25 ఏళ్లలో రెండు, మూడు తరాల యువతరం ఢిల్లీలో ఎదిగిందని, రాబోయే 25 ఏళ్లు భారతదేశ భవిష్యత్తుకు, ఢిల్లీ భవిష్యత్తుకు చాలా కీలకమని చెప్పారు. ఈ పాతికేళ్లలో దేశం 'వికసిత్ భారత్'గా రూపొందనుందని అన్నారు. "ఢిల్లీలో ఈరోజు వేల కోట్లు విలువచేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన జరిగింది. రాబోయే 25 ఏళ్లు, దేశానికి, ఢిల్లీకి చాలా కీలకం. వికసత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం" అని ప్రధాని చెప్పారు. ఢిల్లీ ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని, ఢిల్లీని బీజేపీ అభివృద్ధి పథకంలోకి తీసుకువెళ్తుందని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో 'విపత్తు'నే చూశామని, అభివృద్ధినే ఢిల్లీ ప్రజలు కోరుకుంటున్నారని, ప్రజల కోసం బీజేపీ పనిచేస్తుందని నమ్మకం ప్రజలకు ఉందని అన్నారు. ప్రజావిశ్వాసం చూరగొనడం వల్లే హర్యానా, ఒడిశా, మహారాష్ట్ర వంటి పలు ఎన్నికల్లో పార్టీ గెలుపొందిందని, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ గెలుస్తుందనే గట్టి నమ్మకం ఉందన్నారు.

**ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా..**

ఢిల్లీకి ప్రపంచంలోనే ఉత్తమ నగర హెూదాను తీసుకురాగలిగే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని మోదీ అన్నారు. 'ఆప్‌దా'ను ఢిల్లీ నుంచి తొలగించి ఢిల్లీ ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు.

# ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా రోడ్లను నున్నగా చేస్తా..

**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో తర్వలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయనున్న బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికల్లో తాను గెలిస్తే కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చెంపల మాదిరిగా తన అసెంబ్లీ నియోజకవర్గంలోని రోడ్లను నున్నగా చేస్తానని అన్నారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఢిల్లీ సీఎం అతిషిపై కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రమేష్ బిధురి ఆదివారం ఒక కార్యక్రమంలో మాట్లాడారు. 'బీహార్ రోడ్లను హేమమాలిని చెంపల వలె నున్నగా చేస్తానని లాలూ యాదవ్ ఒకసారి ప్రస్తావించారు. కానీ ఆ వాగ్దానాన్ని నెరవేర్చడంలో ఆయన విఫలమయ్యారు. అయితే ఓఖ్లా, సంగమ్ విహార్‌లోని రోడ్లను మేం అభివృద్ధి చేశాం. అదే మాదిరిగా కల్కాజీలోని ప్రతి రహదారి ప్రియాంక గాంధీ చెంపల మాదిరిగా నున్నగా ఉండేలా చూస్తాం' అని అన్నారు. కాగా, బీజేపీ అభ్యర్థి రమేష్ బిధురి వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. ఆ పార్టీ నాయకురాలు సుప్రియా శ్రీనాట్ ఘాటుగా విమర్శించారు. ఆయన వ్యాఖ్యలు సిగ్గుచేటని అన్నారు. బీజేపీ మహిళా వ్యతిరేక ఆలోచనకు ఇది నిదర్శమని ఆరోపించారు. 'ప్రియాంక గాంధీ గురించి రమేష్ బిధూరి చేసిన ప్రకటన సిగ్గుచేటు మాత్రమే కాదు, మహిళల పట్ల ఆయన అసహ్యకరమైన మనస్తత్వాన్ని కూడా చూపుతున్నది. తోటి ఎంపీపై పరుష పదజాలం వాడి ఎలాంటి శిక్ష అనుభవించని వ్యక్తి నుంచి ఇంకేం ఆశించాలి? బీజేపీ అసలు ముఖం ఇదే' అని ఎక్స్‌లో విమర్శించారు.



# ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటాం

**విజయవాడ:** ఆలయాల ఆస్తులు, ఆచారాలు నాశనమైపోతున్నాయని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం, కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఇవాళ (ఆదివారం) హైందవ శంఖారావం సభ జరిగింది. ఈ సభలో వీహెచ్‌పీ జాతీయ ప్రతినిధులు, బీజేపీ నేతలు, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి మాట్లాడారు. ఆలయాలు బాగుంటేనే మనం బాగుంటామని చెప్పారు. మన ఆలయాలకు గతంలో 15 లక్షల ఎకరాలు ఉండేదని చెప్పారు. ఐసుగడ్డ మాదిరిగా కరుగుతూ 4.50 లక్షల ఎకరాలు మాత్రమే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాలకు కావాల్సిన నిర్ణయాలు ఎవరు చేయాలని ప్రశ్నించారు.

ఆఫీసుల్లో కూర్చునే అధికారులు చేయాలా అని నిలదీశారు. ఆలయాల్లో పూజ ఎంతసేపు చేయాలో ఆఫీసర్ చెప్పాలా...ధర్మాధికారి చెప్పాలా..?? అని ప్రశ్నించారు. ఆలయాలను కట్టుకునే మనం వాటిని నడపలేమా అని అడిగారు. 'మా ఆలయాలను మేమే నిర్వహించుకుంటాం... అధికారులు అవసరం లేదు" అని స్పష్టం చేశారు. ఆలయాల్లో కమిటీలన్నీ రాజకీయంతో నిండిపోతున్నాయిని ఆరోపించారు. ఆలయాల ఆస్తులు తిరిగి వాటికే వచ్చేలా చేయాలని కోరారు. ఆలయాల్లో జరిగే ఆరాధనలు.. సంప్రదాయాల్లో అధికారుల ప్రమేయం ఉండకూడదని షరతు విధించారు. దేవుడి వద్ద వీఐపీ దర్శనాలేంటి అని ప్రశ్నించారు. తిరుపతి వంటి ఆలయాల్లో డబ్బున్నవాళ్లకు వీఐపీ దర్శనాలు, డబ్బులేని వారికి రోజుల తరబడి నిరీక్షణలా అని ఆందోళన వ్యక్తం చేశారు. దేవుడి దర్శనానికి నిబంధనలు పెట్టబట్టే మతమార్పిడులు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. ఆలయాల్లో నిబంధనలు.. సాంప్రదాలను పాటించలేని వారు పక్కకు తొలగాలని హెచ్చరించారు. ఆక్రమణల్లో ఉన్న ఆలయాల ఆస్తులను స్వాధీనం చేయాలని కోరారు. అలా జరగనప్పుడు ఆలయాలు చేయిచాచి అడగనవసరం లేదని చెప్పారు. ఆలయాల్లో దర్శనం టిక్కెట్లతో అవసరం ఉండదన్నారు. మన ఆలయాలను మళ్లీ మన పవర్ ఫుల్ సెంటర్లుగా మార్చుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి పేర్కొన్నారు.

**దేవాదాయశాఖను రద్దుచేయాలి: కమలానంద భారతీ స్వామిజీ**

మనం నిర్మించుకున్న ఆలయాలపై ప్రభుత్వాల పెత్తనమేంటి అని శ్రీ భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతీ స్వామిజీ ప్రశ్నించారు. దేవాదాయశాఖను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సినిమాలకు మాదిరి కౌంటర్లు, టిక్కెట్లు పెట్టి ఆలయాల్లో దైవదర్శనాన్ని అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దేవాదాయ , ధర్మాదాయ శాఖ దుర్మార్గమైనదని మండిపడ్డారు. మన రాష్ట్రంలోని దేవాలయాల బోర్డుల్లో హిందూ అనే పదాన్ని తీసేశారని ఆరోపించారు. హిందూ సమాజమంతా దేవాలయాలను ప్రశ్నించాలని అన్నారు. ప్రభుత్వమే దేవాలయాల భూములను కబ్జాచేసి ప్రభుత్వ కార్యాలయాలు,గోడౌన్లు నిర్మించిందని విమర్శించారు. దేవాలయంలో ఒక దేవుడుంటే 20 హుండీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. హుండీలు పెట్టి భక్తులను దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో దేవాదాయ , ధర్మాదాయ చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించాలని అన్నారు. దశావతారాల్లో ఏడు అవతారాల ఆలయాలు ఉన్నది మన రాష్ట్రంలోనే అని గుర్తుచేశారు. ఏపీని రాష్ట్రప్రభుత్వం దేవభూమిగా ప్రకటించాలని కోరారు. ఏడు అవతారాల ఆలయాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటు చేయాలని కమలానంద భారతి స్వామి డిమాండ్ చేశారు.

**డిక్లరేషన్‌లో కీలక అంశాలివే...**

విజయవాడ: హైందవ శంఖారావంలో విశ్వహిందూ పరిషత్ డిక్లరేషన్ ప్రకటించింది. హిందూ దేవాలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి కలిపిస్తూ చట్టసవరణ చేయాలని డిమాండ్ చేశారు. హిందు ఆలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు సరికాదని చెప్పారు. అన్యాయంగా, చట్టవిరుద్ధంగా దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినాయకచవితి, దసరా వేడుకలకు ప్రభుత్వం నుంచి ఆర్థికభారం, అక్రమ ఆంక్షలు తగవు అని చెప్పారు. హిందూ దేవదేవతల శోభాయాత్రల మార్గాలు, తేదీలు, విధానాలపై అక్రమ ఆంక్షలు తగవని అన్నారు. ఆలయాల్లో పూజ, ప్రసాద, కైంకర్య సేవలు అత్యంత భక్తిశ్రద్ధలతో నాణ్యతతో నిర్వహించాలని తెలిపారు. హిందూ ఆలయాల్లో అన్యమత ఉద్యోగులను తక్షణం తొలగించాలని డిమాండ్ చేశారు. ట్రస్టు బోర్డులో హిందూ ధర్మంపై భక్తిశ్రద్ధలు ఉండే భక్తులను మాత్రమే సభ్యులుగా నియమించాలని కోరారు. రాజకీయేతర ధార్మిక వ్యక్తులను ట్రస్టుబోర్డుల్లో చోటు కల్పించాలన్నారు. హిందూ దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పుప్రకారం అన్యాక్రాంతమైన ఆస్తులను స్వాధీనం చేసుకుని ఆలయాలకు తిరిగి అప్పగించాలని కోరారు. ఆలయాల నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు దారి మళ్లించరాదని చెప్పారు. హైందవశంఖారావంలో డిక్లరేషన్‌పై చినజీయర్ స్వామిజీ ప్రతిజ్ఞ చేయించారు.

**ఈ డిక్లరేషన్ లోని అంశాలు...**

ఆలయాలకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇస్తూ చట్ట సవరణ చేయాలి

హిందూ దేవాలయాల ఆస్తులు, వ్యవస్థలపై దాడులు అరికట్టాలి

చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

వినాయకచవితి, దసరా వంటి ముఖ్య పండుగల సమయంలో ఆంక్షలు విధించడం తగదు

దేవాలయాల్లో పూజలు, ప్రసాదాలు, కైంకర్యాలు భక్తిశ్రద్ధలతో చేయాలి

హిందూ దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వెంటనే తొలగించాలి

హిందూ ధర్మం పాటించే వారినే ట్రస్టు బోర్డుల్లో సభ్యులుగా నియమించాలి

ట్రస్టు బోర్డుల్లో రాజకీయేతర ధార్మిక వ్యక్తులకు స్థానం కల్పించాలి

హిందూ దేవాలయాలకు సంబంధించిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

ఇప్పటికే అన్యాక్రాంతమైన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుని ఆయా ఆలయాలకు అప్పగించాలి

దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ధార్మిక కార్యక్రమాలకే వినియోగించాలి

దేవస్థానాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వ కార్యక్రమాలకు మళ్లించకూడదు

# దేవాలయాలపై దాడులు పెరిగాయి

**విజయవాడ :** దేవాలయాలపై దాడులు పెరిగాయని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఆరోపించారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కావాలని చెప్పారు. ఆలయాల్లో అన్యమతస్తులు పెరిగారని ఆరోపించారు. గన్నవరం, కేసరపల్లి లైలా గ్రీన్ మెడోస్ ప్రాంగణంలో ఇవాళ (ఆదివారం) హైందవ శంఖారావం సభ జరిగింది. ఈ సభలో వీహెచ్‌పీ జాతీయ ప్రతినిధులు, బీజేపీ నేతలు, మఠాధిపతులు, పీఠాధిపతులు, స్వామీజీలు పాల్గొన్నారు. ఈ సభలో దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం, సంప్రదాయాలను కాపాడాలని చెప్పారు. దేవాలయాలకు రక్షణ కల్పించాలని పురందేశ్వరి పేర్కొన్నారు.

ఆ చట్టంతో అర్చకుల హక్కులను కాలరాశారు: మాజీ సీఎస్, ఎల్వీ.సుబ్రహ్మణ్యం

1987లో చేసిన దేవాదాయ, ధర్మాదాయ చట్టం మన ఆలయాల పాలిట శాపంగా మారిందని మాజీ సీఎస్, ఎల్వీ.సుబ్రహ్మణ్యం ఆరోపించారు. మన ఆలయాల వ్యవస్థను నిర్వీర్యం చేసిందని అన్నారు. దేవాదాయ, ధర్మాదాయ చట్టాన్ని తెచ్చి అర్చకుల హక్కులను కాలరాశారని మండిపడ్డారు. 1987లో తెచ్చిన చట్టం మన ఆలయాల ధ్వంసానికి కారణమైందని ఎల్వీ.సుబ్రహ్మణ్యం అన్నారు.

తిరుమల వెంకన్న ఆలయాన్ని రాజకీయాలకు వినియోగించారు: అలోక్ కుమార్

ఈస్ట్ ఇండియా కంపెనీ వాళ్లు 1817లో ఆలయాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారని వీహెచ్‌పీ జాతీయ అధ్యక్షులు




అలోక్ కుమార్ అన్నారు. హిందూ సమాజాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఆలయాలను స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలే ఆలయాలపై పెత్తనం చేస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఆలయాలకు చెందిన లక్షల ఎకరాలను అన్యాక్రాంతం చేశారన్నారు. ఎవరికీ లేని ఆంక్షలు, నిబంధనలు ఆలయాల పైనే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలు పెత్తనం చేస్తూ, కొన్ని చోట్ల అన్యమతస్తులకు నిర్వహణ బాధ్యతలు ఇచ్చారని చెప్పారు. అలాంటి వారు ఆలయాల పవిత్రత, హిందూ ధర్మపరిరక్షణను ఏం పట్టించుకుంటారని ప్రశ్నించారు. కోట్లాది మంది కొలిచే తిరుమల వెంకన్న ఆలయాన్ని రాజకీయాలకు వినియోగించారని ఆరోపించారు. ఆలయాల పవిత్రత దెబ్బతినేలా కొంతమంది వ్యవహరించారని అన్నారు. ఆలయాల్లో ఆచార వ్యవహారాలను మంటగలిపారని మండిపడ్డారు. పాలక మండళ్ల పేరుతో రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని ఆరోపించారు. ఆలయాలకు వచ్చే ఆదాయాలను ఇష్టం వచ్చినట్లుగా మళ్లించారని చెప్పారు. తిరుమలకు భక్తులు ఇచ్చే కానుకలను కూడా పక్కదారి పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇలా హిందూ ధర్మానికి అన్యాయం జరుగుతోందని వాపోయారు. ఆలయాలను పరిరక్షించకుండా ఆదాయ మార్గాలుగా మార్చుకున్నారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఆలయాలకు అన్యాయం జరుగుతూనే ఉందని అన్నారు. ఇక అందరం కలిసికట్టుగా ఉద్యమించి .. ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని అలోక్ కుమార్ పేర్కొన్నారు.

ధర్మజాగరణ, ధర్మసంరక్షణ కోసమే ఈ హైందవ శంఖారావం: గోవింద్ దేవ్ గిరి మహారాజ్

ధర్మజాగరణ, ధర్మసంరక్షణ కోసమే ఈ హైందవ శంఖారావమని రామజన్మ భూమి తీర్థ క్షేత్ర కోశాధికారి గోవింద్ దేవ్‌గిరి మహారాజ్ తెలిపారు.మన దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలే కాదు...దేవునికి నిలయాలు అని చెప్పారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ట మన హైందవ సమాజం అంతా కలిసి నిర్వహించుకున్న కార్యక్రమమని గుర్తుచేశారు. అయోధ్యలో రామజన్మభూమిని స్వతంత్రంగా నిర్వహించుకుంటున్నామని చెప్పారు. దేశంలోని అన్ని ఆలయాలను మనమే స్వయంగా నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని గోవింద్ దేవ్ గిరి మహారాజ్ తెలిపారు.

# ఎమ్మెల్యేలకు సర్వే టెన్షన్

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేల్లో టెన్షన్ నెలకొంది. 6 నెలల్లో మీ శాఖల పురోగతిపై మీరు రిపోర్టు ఇస్తారా? మీ రిపోర్టులు నన్నే ఇవ్వమంటారా? ఇప్పటికే చాలా సార్లు అడిగా.. అయినా మార్పు రాలేదు.. పని తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు.. ఇవి నిన్న కేబినెట్ మీటింగ్‌లో మంత్రులపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.మంత్రుల పనితీరు సరిగా లేదని సీఎం ప్రధాన ఆరోపణ. పనిలో వేగం పెంచాలని.. లేదంటే జరగబోయే పరిణామాలకు తనను బాధ్యుడిని చేయొద్దని చెప్పేశారు సీఎం. పనితీరు సరిగా లేదన్నది ఒక కారణమైతే.. ఆరునెలల పనితీరుపై నివేదికలు ఇవ్వకపోవడం చంద్రబాబు కోపానికి మరో కారణం.పలుసార్లు నివేదికలు కోరినా.. రామానాయుడు, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ శ్రీనివాస్ తప్పా మరెవ్వరూ ఇవ్వలేదు. దీంతో ఇలాంటి నిర్లక్ష్య ధోరణి సహించేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరి పని తీరును తాను గమనిస్తున్నానని ఆయన అన్నారు. ఎవరు ఎన్ని గంటలు పని చేస్తున్నారు? ఎంత వరకు సమీక్షలు నిర్వహిస్తున్నారు? సంబంధిత శాఖల్లో ఫైల్స్ ఎంత త్వరగా మూవ్ అవుతున్నాయో తన దగ్గర లెక్కలు ఉన్నాయని చెప్పారు సీఎం.సంబంధిత శాఖల్లో అధికారులు పనితీరు కూడా మంత్రుల బాధ్యతేనని సీఎం స్పష్టం చేశారు. ఎవరి పని తీరుపై వాళ్లు నివేదికలు ఇవ్వకపోతే.. తానే అందరి రిపోర్టులు బయట పెడతానని ఆయన చెప్పారు. అయితే.. మిగిలిన వారి సంగతి పక్కన పెడితే.. ఆరు నెలల నివేదికలను మంత్రి నారాలోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఇవ్వకపోవడం ఇప్పుడు చర్చకు దారి తీస్తోంది.

# రైల్వే జోన్ డీపీఆర్‌పై రాని క్లారిటీ...

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్రలోని విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రావడం లేదు. ప్రతిసారి రైల్వే జోన్ అంటూ ఏదో ఒక అప్‌డేట్ వస్తుంది, కానీ కనీసం శంకుస్థాపన కూడా జరగలేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక గతంలోనే సిద్ధం చేసినా ఇంకా ఆమోదం రాకపోవడం హాట్ టాపిక్ అవుతోంది. అసలే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటన ఫిక్స్ అని, ఆయన రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారన్న ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. తీరా చూస్తే డీపీఆర్‌కు ఆమోదం రాకుండా, శంకుస్థాపన జరుగుతుందా.. ఇంతకీ ప్రధాని మోదీ వస్తారా లేదా కొత్త టెన్షన్ మొదలైంది. 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనరకు రానున్నారని, విశాఖ రైల్వే జోన్ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. కానీ రియాలిటీకి వస్తే ముందు డీపీఆర్‌పై ఎటూ తేలలేదు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం ఫిబ్రవరి 2019లోనే ప్రకటింటించి. అదే ఏడాది డీపీఆర్ ను కూడా రూపొందించారు. రైల్వే జోన్ స్వరూపాన్ని చూపించే డీపీఆర్ మాత్రం ఇంకా ఆమోదం పొందలేదు. గతంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కేంద్రం సిద్ధంగా ఉందని, అప్పటి వైసీపీ ప్రభుత్వం భూములు కేటాయించి ఇవ్వలేదని పేర్కొనడం రాజకీయంగా సంచలనం రేపింది. గతంలో ఆరిలోవ ప్రాంతంలో రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనానికి ప్రతిపాదనలు పంపినా కేంద్రం అందుకు ఆమోదించలేదన్న వాదన ఉంది. విశాఖ జోన్ లో వాల్తేరు డివిజన్ ఉంటుందా, లేదా అని క్లారిటీ రావాల్సి ఉంది. 2022లో జోన్ ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణానికి డీఆర్‌ఎం ఆఫీస్ ఎదురుగా ఉన్న వైర్ లెస్ కాలనీ ఎంపికైంది. మొత్తం 13 ఎకరాల్లో 8 ఎకరాలలో హెడ్ క్వార్టర్స్ డిజైన్లను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదించారు. అంతా ఓకే అనుకునే లోపు 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఆగిపోయింది.దక్షిణ కోస్తా రైల్వే జోన్ తో పాటు వాల్తేరు డివిజన్ లో కొంత భాగం, ఈస్ట్ కోస్ట్ లోని కొంత భాగంతో కొత్తగా రాయగడ డివిజన్ ను ప్రకటించారు. రైల్వే జోన్ కోసం రూ. 106కోట్లు ప్రకటించగా.. రాయగడకు మాత్రం రూ. 70కోట్లు మంజూరైంది. వాల్తేరు రైల్వే డివిజన్ ను విజయవాడ డివిజన్ లో కలిపి మొత్తం రూట్లు, లైన్లు ఖరారు చేశారు. రాయగడ డివిజన్ లైన్లు ఇప్పటికే ఖరారైనట్టు సమాచారం. జనవరి 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా రాయగడ డివిజన్ కు శంకుస్థాపన చేయనున్నారని వినిపిస్తోంది.జనవరి 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు రానున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. విశాఖ రైల్వే జోన్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి సంబంధించి ఏమైనా ప్రకటన చేస్తారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## గత ప్రభుత్వం తప్పిదం వల్లే జైల్లో ఈ పరిస్థితి

-మొదటిపేజీ తరువాయి

పరిశీలించామని, విచారణ అనంతరం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఫోన్‌లో ఎవరు ఎవరుతో మాట్లాడారో తెలుసుకుని వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జైల్‌లో గంజాయి మొక్క**

జైల్‌లో గంజాయి మొక్క కనిపించిందని, విధులు సమర్థవంతంగా నిర్వహించకపోతే, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని, ఎవ్వరిని ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత సంచలన వ్యాఖ్యలు చేశారు. విచారణ చేసిన తర్వాతే విశాఖ సెంట్రల్ జైల్‌లో ఉద్యోగులను బదిలీలు చేస్తామని, ఇప్పటి వరకు ఎవ్వరిని సస్పెండ్ చేయలేదని ఆమె తెలిపారు. యూనిఫాం సర్వీసులో ఉన్నవారు ధర్నాలో, బందులో పాల్గొనకూడదన్నారు. కొత్త సూపరింటెండెంట్ సెంట్రల్ జైల్‌ను ప్రక్షాళన చేస్తున్నారన్నారు. టెక్నాలజీని కూడా ఉపయోగగించుకుంటామని, సెంటర్ జైల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, పదిరోజులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. విశాఖ సెట్రల్ జైల్ నుండి కొంతమంది ఖైదీలను రాజమండ్రి జైల్‌కు తరలిస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాలు సెంట్రల్ జైల్‌ను విజిట్ చేసిన దాఖలాలు లావని విమర్శించారు. టెక్నాలజీ నుండి ఎవ్వరు తప్పించుకోలేరన్నారు. పది, పదిహేను రోజుల్లో సెల్ ఫోన్ వ్యవహారంలో విచారణ రిపోర్టు వస్తుందని, జైల్లో సిబ్బందిని పెంచుతామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

కాగా విశాఖ సెంట్రల్ జైలు భద్రత, కదలికలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జైల్లోని బ్యారెక్స్‌పై జైలు సూపరింటెండెంట్ మహేష్ బాబు తనిఖీలు చేపట్టారు. జైల్లోని అన్ని బ్లాక్ లలో అధికారులు సోదాలు నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి తనిఖీలు చేయడంతో మూడు సెల్ ఫోన్లు, ఒక్క సెల్ బ్యాటరీ, రెండు డేటా కేబుల్లు స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. నాలుగు రోజుల క్రితం విశాఖ మాజీ ఎంపీ కుటుంబం కిడ్నాప్ కేసులో నిందితుడు హేమంత్ కుమార్ డైరెక్ట్ లో దొరికిన రెండు సెల్ ఫోన్లు, బ్యాటరీ, రెండు డేటా కేబుళ్ళు. నిన్న నర్మదా బ్లాక్ లో జైలు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలోనే హోంమంత్రి అనిత ఈ రోజు విశాఖ సెంట్రల్ జైలును సందర్శించారు.

## ప్రధాని పర్యటన రాష్ట్రానికి ఎంతో కీలకం




-మొదటిపేజీ తరువాయి

ప్రధాని పర్యటనకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధు లకు మంత్రుల బృందం దిశానిర్దేశం చేసింది. ప్రధాన మంత్రి పర్యటన రాష్ట్రానికి ఎంతో కీలకం అని, రాష్ట్ర భవిష్యత్ ఈ పర్యటనపై ఆధారపడి ఉందని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి మోడీ ఎంతో మద్దతుగా నిలుస్తున్నారని, ఏ రాష్ట్రానికి కేటాయించని ప్రాజెక్టులను, నిధులను ఏపీకి కేటాయించారని మంత్రి తెలిపారు. రాష్ట్రాన్ని ఫాస్ట్ ట్రాక్ లో పెట్టేందుకు కేంద్ర మద్దతు చాలా అవసరం. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీయే నినాదం. ఇదేదో కేవలం ఉత్తరాంధ్రకు సంబంధించిన పర్యటన కాదు.. మొత్తం ఆంధ్ర రాష్ట్ర భవిష్యత్ కు సంబంధించినది. మనం కూడా సింగిల్ ఎజెండాతో బూత్ స్థాయిలో మానిటరింగ్ చేసి ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి. అందుకు తగ్గట్లుగా ప్రధాని రోడ్ షో, బహిరంగ సభకు ఘనంగా ఏర్పాట్లు చేయాలి. గతంలో విజయవాడలో జరిగిన ప్రధాని రోడ్ షో కంటే మిన్నగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ విజయవాడ రోడ్ షో, చిలకలూరిపేటలో జరిగిన బహిరంగ సభల గురించి ప్రధాని ప్రస్తావిస్తుంటారని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ గుర్తుచేశారు.

ప్రధానమంత్రి రోడ్ షో కు సంబంధించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సింగిల్ బారికేడ్లు ఏర్పాటు చేయాలని మంత్రుల బృందం పోలీసు ఉన్నతాధికారులకు సూచించింది. ఎంతమంది తరలివచ్చినా ఎలాంటి ఆంక్షలు విధించకుండా అందరినీ అనుమతించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రులు పలు సూచనలు చేశారు. రోడ్ షో ను విభాగాల వారీగా విభజించి ప్రజాప్రతినిధులకు, అధికారులకు బాధ్యతలు అప్పగించారు. రోడ్ షో, బహిరంగ సభలకు సంబంధించి పర్యవేక్షణ బాధ్యతలను మూడు పార్టీల నుంచి ఒక్కొక్క ప్రజాప్రతినిధి చొప్పన సమన్వయ బాధ్యతలు అప్పగించారు. ప్రజలు సురక్షితంగా తమ ఇళ్లకు చేరేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బహిరంగ సభలో నియోజకవర్గాల వారీగా బ్లాక్ లు ఏర్పాటుచేయాలని, ప్రజాప్రతినిధులు సమన్వయ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి బహిరంగ సభకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి సుమారు 3 లక్షల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంది. ఇందుకు తగ్గట్లుగా వసతులు, భోజన సదుపాయం కల్పించాలని మంత్రుల బృందం ఆదేశించింది. జనసమీకరణ, పార్కింగ్, పాస్ ల పంపిణీపైనా సమావేశంలో చర్చించారు. ద్విచక్ర వాహనాలపై వచ్చేవారికీ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఉత్తరాంధ్ర జిల్లాల కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జనవరి 8వ తేదీన ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని మంత్రుల బృందం పరిశీలించింది. ప్రాంగణం మొత్త కలియతిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు.

## కమలానికి సేనాని ఎవరు?

-మొదటిపేజీ తరువాయి

ఆ తరహా నాయకుల కోసం సెర్చింగ్ చేస్తోంది. ఈ క్రమంలో నలుగురు పేర్లు బయటకు వచ్చాయి. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, సీనియర్ నేత రఘురామ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి.పార్టీ అధ్యక్షుడిగా పార్థసారథి లేదా సుజనా చౌదరిలో ఎవరినైనా ఎంపిక చేయవచ్చు. కానీ, బీజేపీ ఆర్ఎస్ఎస్ (రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్)తో సంబంధాలున్న వ్యక్తులకు ప్రాధాన్యతనిస్తే బాగుంటుందని ఆలోచన చేస్తోంది. వారంతా పార్టీకి అనుకూలంగా పని చేస్తారని ఆలోచన చేస్తోంది. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, రఘురామ్ పేర్లు వచ్చాయి.పార్టీ హైకమాండ్‌తోపాటు ఆర్ఎస్ఎస్‌తో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి మాంచి సన్నిహిత సంబంధాలున్నాయి. రాష్ట్ర అధ్యక్ష పదవికి బలమైన పోటీదారుగా కనిపిస్తున్నారాయన. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం నుంచి వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి. ఈ ప్రాంతం నుంచి పార్టీ నాయకత్వం వహించడానికి ఇప్పటివరకు నేతలు లేరు. ఆయనైతే బాగుంటుందన్నది పార్టీ వర్గాల ఆలోచన.విభజన తర్వాత బీజేపీలో చేరారు మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి. రెండేళ్ల కిందట ఆమె ఏపీ పార్టీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు బీజేపీ తరపున జాతీయ స్థాయిలో పార్టీ పదవులు నిర్వహించారు కూడా.ముఖ్యంగా మొన్నటి ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు వెనుక ఆమె కీలక రోల్ పోషించారు ఆమె. ఈ క్రమంలో ఆమెను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకోవచ్చనే వార్తలు లేకపోలేదు. మొత్తానికి రెండు వారాల్లో ఏపీ కొత్త చీఫ్ ఎవరనేది తేలనుంది.

## సంపాదకీయం

# మరోరూపంలో మూడు చట్టాలు

రైతుల ఆందోళనకు తలొగ్గి గతంలో వెనక్కి తీసుకున్న మూడు సాగు చట్టాల్లోని అంశాలకు వేరే ముసుగులు తగిలించి తిరిగి ప్రవేశపెట్టేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదా? అప్పట్లో వాటి రద్దు సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోసం ఇప్పుడు పోరాడుతున్న రైతులు ఇదే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కోసం పంజాబ్-హర్యానా సరిహద్దుల్లోని శంభు వద్ద రైతులు పది నెలలుగా ఆందోళన చేస్తుంటే వారితో చర్చలకు ముందుకు రాకపోగా, ఇప్పుడు రద్దు చేసిన సాగు చట్టాలకు మించిన భయంకరమైన యంత్రాంగాన్ని మరో రూపంలో తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నది. 'కాలగర్భంలో కలిసిపోయాయనుకున్న మూడు నల్ల చట్టాలు మళ్లీ నెత్తిన పడతాయన్న భయం రైతులను వెంటా డుతున్నది. అందుకు తగ్గట్టుగానే 'అగ్రికల్చర్ మార్కెటింగ్' (ఎన్‌పీఎఫ్ఏఎం)పై కేంద్రం జాతీయ విధాన ముసాయిదా రూపొందించడం రైతుల ఆందోళనకు గురిచేస్తున్నది. 2021లో రద్దుచేసిన మూడు సాగు చట్టాలను దొడ్డి దారిన తీసుకొచ్చేందుకే ఈ ప్రయత్నమని, వాటి తో పోలిస్తే ఇది మరింత ప్రమాదకరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'కిసాన్ ఆందోళన్-2.0' పేరుతో 9 నెలలుగా కొనసాగుతున్న పోరాటంలో కిసాన్ యూనియన్ సిద్ధూపూర్ రాష్ట్ర అధ్యక్షుడైన జగ్జీత్‌సింగ్ డల్లేవాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హర్యానా-పంజాబ్ సరిహద్దులోని ఖనౌరీలో నవంబర్ 26న ఆయన ఆమరణ దీక్ష చేపట్టి రైతు ఉద్యమాన్ని మలుపుతిప్పారు. దీని తర్వాత రైతు ఉద్యమంలో ప్రజల భాగస్వామ్యం పెరిగింది. డల్లేవాల్ దీక్షను భగ్నం చేయడం, రైతుల ఒత్తిడితో తిరిగి విడుదల చేయడం వివాదాస్పదమైంది. సుప్రీం ఆదేశాలతోనే డల్లేవాల్ దీక్షను భగ్నం చేశామని పోలీసులు అంటుంటే.. తామెన్నడూ అలా ఆదేశించలేదని సర్వోన్నత న్యాయస్థానం చెప్తున్నది. ఇక, పంట ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ) మార్కెట్లను రద్దు చేయడంతోపాటు కాంట్రాక్ట్ సాగును ప్రోత్సహిస్తూ నిరుడు నవంబర్ 25న ముసాయిదా విధానాన్ని కేంద్రం విడుదల చేసింది. గతంలో తీసుకొచ్చిన మూడు సాగుచట్టాల్లో ఇది కూడా ఒకటి కావడంతోనే అప్పట్లో రైతులు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇప్పుడు మళ్లీ దీనిని దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతుండటంపై మరోమారు పిడికిలెత్తారు. గత హామీల అమలు కోసం పోరాడుతుంటే అది పట్టని కేంద్రం ఇప్పుడు సాగు మొత్తాన్ని ప్రైవేటీకరణ వైపు తీసుకెళ్లే ఆలోచన చేస్తుండటం రైతులను విస్మయానికి గురిచేస్తున్నది. దీనికితోడు పంజాబ్‌లో ఏంపీఎంసీ మార్కెట్ల విధానాన్ని సమూలంగా మార్చాలని చూస్తుండటంతో రైతులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. అంతేకాదు, ముసాయిదా పాలసీపై స్పందించేందుకు రాష్ట్రాలకు కేంద్రం రెండువారాల సమయం మాత్రమే ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశం కూడా ఇదేనని అంటున్నారు. కాబట్టి పంజాబ్ వెంటనే దీనికి వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, అన్ని రాష్ట్రాలు ఇదే వైఖరి అవలంబించాలని రైతు సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కిసాన్ మజ్దూర్ మోర్చా (కేఎంఎం) డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన అగ్రికల్చర్ మార్కెటింగ్ ముసాయిదా పాలసీలో ప్రైవేటు హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయడం, ప్రాసెసర్లు, ఎగుమతిదారు లు, వ్యవస్థీకృత రిటేలర్లు, బల్క్ బయ్యర్లను నేరుగా హోల్‌సేల్ కొనుగోలుకు అనుమతించడం వంటివి రైతుల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. ముఖ్యంగా కాంట్రాక్ట్ సాగుపై ప్రభుత్వం పట్టుబట్టడం విమర్శలకు గురవుతున్నది. ఇది అమల్లోకి వస్తే తమ పొలంలో తామే కూలీలుగా మారిపోతామన్న భయం వారిలో వ్యక్తమవుతున్నది. మరోవైపు, దీనిపై రైతుల ఆందోళన అవసరం లేద ని, వారి మేలుకోసమే దీన్ని తీసుకొస్తున్నట్టు కేంద్రం చెప్తున్నది. ప్రైవేటు మార్కెట్ల మధ్య పోటీ పెరిగితే రైతుల మేలుకే దోహదం చేస్తుందని, వారి నికర ఆదాయాన్ని పెంచాలన్నదే తమ యోచన అని కేంద్రం వాదిస్తున్నది. ఎన్‌పీఎఫ్ఏఎం నిస్సందేహంగా రద్దు చేసిన వ్యవసాయ చట్టాలకు 'బ్యాక్ డోర్ ఎంట్రీ' ఇస్తుందని ఎస్‌కేఎం నేత రాజేవా ల్ చెప్తున్నారు. కొత్త ముసాయిదా విధానంతో ప్రైవేటు వ్యాపారులకు గిడ్డంగులు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుందని, కాబట్టి ఇది ఆమోదయోగ్యం కాదం టున్నారు. ఏది ఏమైనా ఈ పాలసీని వ్యతిరేకించి తీరుతామని రైతులు భీష్మించుక్కూర్చున్నారు. రైతు సంఘాలను మరోమారు ఏక తాటిపైకి తెచ్చి దీనికి వ్యతిరేకంగా పోరాడుతామని, ఇందుకోసం ఎంతవరకైనా కొట్లాడతామని ఆ సంఘం నేతలు హెచ్చరిస్తున్నారు.

# మళ్లీ పంజా విసురుతున్న వలసవాదం

తెలంగాణ ఏర్పడిన తొలి ఏండ్లలో రాసుకున్న మాటలను మళ్లీ ఇవాళ గుర్తుచేయాల్సిన అవసరం ఏర్పడింది. 'ఇవాళ తెలంగాణను రెండు రకాల ప్రతీప శక్తులు చుట్టు ముట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రజల బతుకులు ఒక తెరపైకి వస్తున్న ఈ సమయంలో ఓ దిక్కు వలసవాద శక్తులు మారు రూపాల్లో తెలంగాణలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్నాయి. మరో దిక్కు తెలంగాణ సమాజంలో శతాబ్దాల తరబడి పాతుకుపోయిన మత సామరస్యం, సమ్మిళిత సహజీవన సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తూ మత తత్వాన్ని సమాజంలో ప్రోది చేసేందుకు జాతీయ మతతత్వ శక్తులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మతపరమైన విభజన ఆధారంగా అధికారంలోకి రావాలనేది ఆ శక్తుల లక్ష్యం. ఈ రెండు రకాల ప్రతీప శక్తుల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన ఒక చారిత్రక సందర్భం మళ్లీ ప్రజల ముందు సాక్షాత్కరించింది. ఈ నేపథ్యంలో మన అప్రమత్తతే మనలను రక్షిస్తుంది. లేకుంటే తెలంగాణ 60 ఏండ్ల పాటు ఉమ్మడి రాష్ట్రంలో అరిగోస పడిన అనుభవాలను మరొక్కసారి మననం చేసుకోవాల్సి ఉన్నది' అని గతంలో రాశాను. ఇటీవలి కాలంలో.. అంటే తెలంగాణలో కేసీఆర్ ఓడిపోయి ఏపీలో చంద్రబాబు రెండవ సారి అధికారంలోకి వచ్చినాక జరిగిన కొన్ని సంఘటనలను విశ్లేషించినప్పుడు వలసవాదం మళ్లీ పంజా విసురుతున్నట్టు అర్థం అవుతున్నది. చరిత్రలో మనం ధోఖా తిన్న, మోసపోయిన అనుభవాలను ప్రస్తావించుకొని వర్తమానంలోకి వద్దాం. పచ్చని తెలంగాణ రాష్ట్రాన్ని చూసి ఓర్వలేని వలసవాద శక్తులు కేంద్రంలోని మతతత్వ శక్తుల అండతో తెలంగాణ ప్రగతిని అడ్డుకోవడానికి దూకుడును పెంచాయి. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు గమనిస్తే%% తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో 20 దాకా ప్రశ్నలు టీడీపీ, ఆంధ్ర కాంట్రాక్టర్లపై వచ్చినట్టు పత్రికల్లో విస్తృతంగా వార్తలు వచ్చాయి. వాటిపై సోషల్ మీడియాలోనూ విస్తృతంగా చర్చ జరిగింది. ఇదెట్లా సాధ్యమైంది? తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పదేండ్ల పాటు రాని ఇటువంటి ప్రశ్నలు ఆంధ్రాలో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఎందుకు వచ్చినట్టు? తెలంగాణ అధికార వ్యవస్థల్లో చంద్రబాబు దళారీలు చొరబడితేనే ఇది సాధ్యమవుతుంది.

చరిత్రలో నిర్లక్ష్యం ఫలితాలు: గతంలో మనం అప్రమత్తంగా లేకపోవడం వల్ల అరవై ఏండ్లుగా ఎంతటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక నష్టాలను చవి చూడవలసి వచ్చిందో ఆ చరిత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అవసరం. 1956లో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు బిల్లును రూపొందించినప్పుడు బిల్లులో రాష్ట్రం పేరును 'ఆంధ్రా- తెలంగాణ'గా ఖరారు చేశారు. బిల్లును పార్లమెంట్ సెలెక్ట్ కమిటీకి పంపితే ఆ కమిటీ కూడా అదే పేరును ఆమోదించింది. బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదం పొందే సమయంలో ఆంధ్ర లాబీయిస్టులు ఒక సవరణను ప్రతిపాదించారు. రాష్ట్రం పేరులోంచి 'తెలంగాణ' పదాన్ని తొలగించి ఆంధ్ర పక్కన 'ప్రదేశ్' అన్న హిందీ పదాన్ని చేర్చి రాష్ట్రం పేరును 'ఆంధ్రప్రదేశ్'గా మార్చారు. ఆ సవరణతోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొందింది.

ఈ సవరణ ప్రతిపాదిస్తున్న సమయంలో తెలంగాణ లోక్‌సభ సభ్యులు బహుశా నిద్రపోతున్నారో! మరి సభలో లేరో! కొత్త రాష్ట్రం 'ఆంధ్ర-తెలంగాణ' పేరుతో కాక 'ఆంధ్రప్రదేశ్' పేరుతో ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టుకతోనే తెలంగాణకు ద్రోహం తలపెట్టింది. తెలంగాణ అస్తిత్వానికి పాతర వేసింది. తెలంగాణ పదం ఎప్పటికైనా తెలంగాణ ప్రజల్లో ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను రాజేస్తుందని వారికి తెలుసు. తెలంగాణ అస్తిత్వాన్ని శాశ్వతంగా ఖతం చేయడానికే ఆ సవరణ తీసుకవచ్చి తెలంగాణ పదాన్ని తొలగింపచేశారు. ఆ తర్వాత పెద్ద మనుషుల ఒప్పందాన్ని, ఆరు సూత్రాల పథకాన్ని ఎట్లా ఉల్లంఘించారో మనందరికీ తెలిసిన చరిత్రనే.రాష్ట్రపతి ఉత్తర్వుల్లో సేవింగ్స్ పేరా 14: 1973లో జై ఆంధ్ర ఉద్యమాన్ని చల్లార్చేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆరు సూత్రాల పథకాన్ని ప్రతిపాదించారు. ఈ పథకాన్ని తెలంగాణ నాయకత్వం ఎటువంటి విశ్లేషణ లేకుండా గుడ్డిగా అంగీకరించింది. హైదరాబాద్ రాజ్య ప్రజలు పోరాడి సాధించుకున్న 'ముల్కీ రూల్స్' రద్దు, పెద్ద మనుషుల ఒప్పందంలో ఒక ప్రధాన అంశంగా ఉండిన తెలంగాణ 'రీజినల్ కమిటీ' రద్దు కూడా ఆరు సూత్రాల పథకంలో ఉన్నాయి. ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్లు కల్పించి అన్ని ప్రాంతాలకు సమ న్యాయాన్ని కల్పించడానికి ఉద్దేశించినదే మూడవ సూత్రం. అందులో భాగంగానే రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 371-డీని రాజ్యాంగంలో చేర్చారు. ఉద్యోగాల కల్పనలో అన్ని ప్రాంతాలకు సమన్యాయం కల్పించడానికి ఒక ఉత్తర్వును జారీ చేయడానికి రాష్ట్రపతికి 371-డీ ఆర్టికల్ ద్వారా అధికారం సంక్రమించింది. అట్లా సం క్రమించిన అధికారంతో 1975



అక్టోబర్ 18న రాష్ట్రపతి ఉత్తర్వులు వెలువడినాయి. ఆ ఉత్తర్వుల్లోని అంశాలను తెలంగాణ ఉద్యోగ సంఘ నాయకులు గాని, తెలంగాణ రాజకీయ నాయకులు గాని ఎవరూ చదివి ఉండరు. చదివినా, అందులోని కుట్రపూరితమైన పేరాలను పసిగట్టి ఉండరు. పసిగట్టినా, ఏమీ మాట్లాడలేక మిన్నకుండిపోయి ఉంటారు. రాష్ట్రపతి ఉత్తర్వులలో 'పేరా 14' అనే మినహాయింపుల క్లాజ్ (సేవింగ్స్ క్లాజ్) ఉన్నది. ఈ పేరా తెలంగాణకు ఎంతటి ఆర్థిక, సామాజిక నష్టాన్ని కలగజేసిందో అంచనా కట్టలేం. ఈ మినహాయింపుల పేరా కారణంగా సచివాలయంలో, శాఖాధిపతుల కార్యాలయాల్లో, రాష్ట్రస్థాయి కార్యాలయాల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో స్థానిక రిజర్వేషన్లు ఉండవు. కాబట్టి, ఈ కార్యాలయాల్లో సీమాంధ్రులు దర్జాగా, రాజ మార్గంలో దిగబడిపోయారు. చట్టబద్ధంగానే హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగాలన్నీ సీమాంధ్రుల వశమయ్యాయి. ఆర్టికల్ 371-డీ చెప్పిన అన్ని ప్రాంతాలకు సమన్యాయం ఇక్కడ భూస్థాపితమైంది. ఏపీ రాష్ట్ర అధికార కేంద్రమైన సచివాలయంలో తెలంగాణకు నామ మాత్రమైన ప్రాతినిధ్యమే దొరికింది. ప్రభుత్వ విధానాలు, బడ్జెట్ కేటాయింపులు, భూ కేటాయింపులు, పర్మిషన్లు, పోస్టింగులు, ఇతరత్రా ప్రభుత్వ నిర్ణయాలు జరిగే సచివాలయంలోని కీలక పోస్టుల్లో ప్రాతినిధ్యం లేనందు వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాకా వివక్షకు లోనై అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయింది. మనం అప్రమత్తంగా లేకపోవడం వల్ల తెలంగాణ ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి పరంగా తీవ్రంగా నష్టపోయింది.

వలసవాదం పొంచి ఉన్న పులి లాంటిది: 2014, ఫిబ్రవరిలో పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పాస్ చేస్తున్న సమయంలో తెలంగాణ సమాజం, రాజకీయ నాయకత్వం చూపించిన అప్రమత్తతే, జాగరూకత ఇప్పుడు కూడా అవసరమే. తెలంగాణ ప్రజలు సదా అప్రమత్తంగా ఉండవలసిందే. ఇప్పుడు వలసవాదం రూపం మార్చుకొని, నినాదం మార్చుకొని తెలంగాణలోకి చొరబడేందుకు ప్రయత్నిస్తున్నది. అప్రమత్తతనే మనకు రక్ష. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఊహించినట్టుగానే మొదటి నాలుగేండ్లు చంద్రబాబు పాలన తెలంగాణతో ఘర్షణ వైఖరితోనే కొనసాగింది. తన దళారీ వర్గంతో ఇక్కడ తన ఆధిపత్య రాజకీయాలను నడపాలని కలగన్నాడు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేశారు. అయితే, తెలంగాణ ప్రజలు ఈ ఆంధ్రా వలసవాద పార్టీలను తెలంగాణ పొలిమేరలు దాటించారు. తెలంగాణ ఉద్యమంతో వారి దళారీ వర్గాలు బలహీనపడ్డాయి. బలహీనపడ్డాయే తప్ప పూర్తిగా అంతం కాలేదు. వలసాధిపత్యం అదను కోసం వేచిచూసే పులి లాంటిది. ఈసారి రూపం మారింది. నినాదం మారింది. 'రాజన్న రాజ్యం' అంటూ తెలంగాణ ప్రజలను మత్పరించే ప్రయత్నంలో భాగంగా ఒక దుక్నం తెరిచి గొంతు చించుకుంటూ కొంతకాలం రాష్ట్రమంతా తిరిగారు.

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించుకుంటూ, తెలంగాణకు అనాది ఆధారాలుగా ఉన్న చెరువులను బాగు చేసుకుంటూ, తెలంగాణ వాగుల మీద చెక్‌డ్యాంలు నిర్మించుకుంటూ, కృష్ణా, గోదావరి జలాల్లో తన వాటాను సంపూర్ణంగా వినియోగించుకుంటూ దశాబ్దాల నీటి గోసను తీర్చుకుంటున్న తరుణంలో రాజన్న రాజ్యం నినాదం పేరుతో ఆంధ్రా వలసవాదం తెలంగాణ రాజకీయరంగం మీదికి చొరబడే ప్రయత్నాలు చేసి భంగపడింది. తెలంగాణ ప్రజలు స్పందించకపోయేసరికి తోక ముడిచి తెలంగాణలో దుక్నం ఎత్తేసి ఆంధ్రాలో ఉన్న మరో పాత దుక్నంలో కలిసిపోయింది. ఆంధ్రాలో చంద్రబాబు రెండవ సారి అధికారంలోకి రావడంతో తెలంగాణలో బలహీనపడిన వలసవాద శక్తులు జాతీయ మతతత్వ శక్తులతో మిలాఖతై తెలంగాణలో చొరబడాలని, తెలంగాణను ఆగం చేయాలని ప్రయత్నిస్తున్నాయి. దూకుడు పెంచిన వలసవాద శక్తులు: పదేండ్ల కేసీఆర్ పాలనాకాలంలో హైదరాబాద్ విశ్వ నగరంగా ఎదుగుతున్న దిశలో పయనించింది. అమెజాన్, ఆపిల్, ఫేస్‌బుక్, గూగుల్, ఉబర్, సేల్స్‌ఫోర్స్ లాంటి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో తమ ఇంటర్నేషనల్ క్యాంపస్‌లు నిర్మించుకున్నాయి. దీనివల్ల లక్షల మంది యువకులకు ఐటీరంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. హైదరాబాద్ నగరం అప్రతిహతంగా అభివృద్ధి దారిలో పరుగెడుతున్న దశ. రాష్ట్రంలో కాళేశ్వరం, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా తదితర ప్రాజెక్టుల నుంచి సరఫరా అవుతున్న నీటితో, పచ్చని పంటలతో, ఎండకాలంలో కూడా మత్తళ్లు దుంకుతున్న చెరువులు, చెక్‌డ్యాంలు నీటితో కళకళలాడుతుండేవి. ఉమ్మడి రాష్ట్రం కరువు జిల్లాగా, వలసల జిల్లాగా దేశంలో పేరు పొందిన పూర్వ మహబూబ్‌నగర్ జిల్లా నీటి గోస నుంచి బయటపడింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలు, చెరువుల ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందినందున మహబూబ్‌నగర్ జిల్లా కరువు నుంచి దూరమైంది. జిల్లా నుంచి వలసలు బందయ్యాయి. వ్యవసాయం పుంజుకోవడంతో ఆ జిల్లాకే పొరుగు రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం వస్తున్నారు. చెరువుల్లో ఏడాది పొడుగూతా నీరు నిండుగా ఉండటం, వాగులపై చెక్‌డ్యాంల నిర్మాణం కావడం వల్ల రాష్ట్రంలో భూగర్భ జలాలు అనూహ్యంగా పైకి లేచాయి. బోర్ల కింద వ్యవసాయం పుంజుకున్నది. ఒకవైపు రైతు సంక్షేమ పథకాలు, మరోవైపు పుష్కలంగా రెండు పంటలకు సాగునీరు అందడంతో రైతన్నకు వ్యవసాయంపై భరోసా పెరిగింది.

కేసీఆర్ నేతృత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా తెలంగాణ ఎదగడానికి రైతాంగం శ్రమపడింది. వ్యవసాయం ద్వారా అత్యధికంగా ఆదాయం పొందే రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలిచింది. రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. అన్ని మానవాభివృద్ధి సూచికల్లో తెలంగాణ అగ్రగామి రాష్ట్రంగా నిలబడింది. ఇవన్నీ నిజమని ఎవరో కాదు ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన గణాంకాలు స్పష్టంచేశాయి. ఇదిలా ఉంటే కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న పాలమూరు రంగారెడ్డి, వార్ధా, సవరించిన కాళేశ్వరం డీపీఆర్‌లను కేంద్రం వెనక్కి పంపినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి. సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుమతుల ప్రక్రియ ఆగిపోయింది. ఆంధ్రలో అధికార మార్పిడి జరిగిన కొద్ది నెలల్లోనే ఈ డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయంటే చంద్రబాబు ప్రభుత్వం ఢిల్లీలో వేసిన ఎత్తుల వల్లనే అని అర్థమవుతున్నది. పాలమూరు ప్రాజెక్టుకు 90 టీఎంసీల నికర జలాలు కేటాయించిన తర్వాతనే గత ప్రభుత్వం డీపీఆర్‌ను కేంద్ర జల సంఘానికి, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపింది. పర్యావరణ మంత్రిత్వ శాఖ సలహా మండలి (ఈఏసీ) కూడా ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి జారీ చేయమని మంత్రిత్వ శాఖకు సిఫారసు చేసింది. ఏడాది గడిచిన తర్వాత ఈఏసీ సిఫారసు ఉన్న ప్రాజెక్టు డీపీఆర్‌ను పర్యావరణ అనుమతి ఇవ్వకుండానే కేంద్రం వెనక్కి పంపించిందంటే చంద్రబాబు ఒత్తిడి ఏ మేరకు ఉన్నదో అర్థమవుతున్నది. ఆయన గతంలో అధికారంలో ఉన్నప్పుడు పాలమూరు ప్రాజెక్టుపై కేంద్రానికి షికాయతులు చేస్తూ పదుల సంఖ్యలో లేఖలు రాసిన సంగతి మరచిపోరాదు. ఆంధ్రా రైతులతో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయించి ప్రాజెక్టు పురోగతిని అడ్డుకున్నాడు. ఇప్పుడు గోదావరి బనకచర్ల (పోతిరెడ్డిపాడు తూము కింద ఉన్న హెడ్ రెగ్యులేటర్ కాంప్లెక్స్) లింకు ప్రాజెక్టును సుమారు రూ.80 వేల కోట్ల కేంద్ర నిధులతో పూర్తిచేయాలని సంకల్పించాడు. 300 టీఎంసీల గోదావరి నీటిని తరలించే ఈ ప్రాజెక్టు వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ పౌర సమాజం మదింపు చేయాల్సి ఉన్నది. హైదరాబాద్‌లో 100 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం పెట్టడానికి రాష్ట్ర సర్కారు సహకరిస్తుందట. ఎందుకు? తెలంగాణలో ఇప్పటికే ఊరూరా ఏర్పాటై ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలు తక్కువైనాయా? తెలుగు జాతి పేరు చెప్పి మళ్లీ తెలంగాణను వలసవాదానికి బలి చేయడానికా? బలహీనపడిన వలసవాద దళారీ శక్తులు తిరిగి తెలంగాణలో తలెత్తుకోవడానికా? తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఏర్పాటైన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో వీక్షణం స్టాల్ మీద ఎప్పుడో ముద్రణ అయిన ఒక పుస్తకాన్ని అమ్ముతున్నందుకు మతతత్వ వాదుల దాడి జరిగిన సంగతి విస్తృతంగా చర్చకు వస్తున్నది. ఆ ఘటన అనంతరం వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడుతూనే ఉన్నారు. వేణుగోపాల్ చేసిన నేరమేమిటి? కాలానికి కాపలా కాయాలి: పొలిమేరలు దాటిన వలసవాదం జాతీయ మతతత్వ శక్తుల అండతో తిరిగి మరో రూపంలో తెలంగాణలో చొరబడడానికి దూకుడు పెంచింది. తెలంగాణ ప్రజానీకం అప్రమత్తంగా ఉండకపోతే బలహీనపడిన వలసవాద దళారీవర్గాలు బలం పుంజుకుంటాయి. తెలంగాణను వలసవాద శక్తులతో మిలాఖత్ అవుతున్న మతతత్వ శక్తుల బారిన పడకుండా కాపాడుకోవలసిన బాధ్యత తెలంగాణ ప్రజానీకం మీదనే ఉన్నది. కవి, రచయిత పరవస్తు లోకేశ్వర్ ఉద్యమ సమయంలో అన్నట్టు 'ఇప్పుడు కూడా కనురెప్పలు కత్తిరించుకొని కాలానికి కాపలా కాయాలి'.

# వైవిధ్యాన్ని కోరుకునే దర్శకుడు

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంతసులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలా మంది రచయితలకు ఎక్కువమంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాలచందర్‌తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండతెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్యతరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు.బాలచందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలకపాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్‌పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్‌పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు.

## సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో

# కామ్రేడ్ రామకృష్ణారెడ్డి 12వ వర్ధంతి

**కామ్రేడ్ రామకృష్ణారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం: బి.సురేష్**




గుంతకల్లు జనవరి 5 ప్రజా జ్యోతి ప్రతినిధి (ఆనందరాజు): పట్టణంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ రామకృష్ణారెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా రామకృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి కామ్రేడ్ రామకృష్ణా రెడ్డి అమరత్వం వర్ధిల్లాలి, భారత విప్లవ ఉద్యమంలో అమరులైన అసంఖ్య వీరులకు విప్లవ జోహార్లు , అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం,నూతన ప్రజాస్వామ్యక విప్లవం వర్ధిల్లాలి నినాదాలు చేయడం జరిగినది.తర్వాత సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్, కర్నూలు జిల్లా ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప మాట్లాడుతూ కామ్రేడ్ రామకృష్ణారెడ్డి సుదీర్ఘకాలం విప్లవ ఉద్యమంలో పనిచేస్తూ పేదల,కార్మికుల పక్షాన నిలబడి పాలకవర్గాలకు వ్యతిరేకంగా ఉద్యమించడం జరిగినది.ఈయన అనంతపు రం పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి 42 కాలనీలను ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించినారు. కార్మికులకు యూనియన్లు ఏర్పాటు చేసి ఈపీఎఫ్, ఈఎస్ఐ,గ్రాచ్యూటీని యాజమాన్యం నుండి ఇప్పించడంలో ముందు భాగాన నిలిచేవారు. పెనుగొండ ప్రాంతంలో రైతు కూలీలను సమీకరించి వందలాది ఎకరాల శోత్రియం భూములను రైతు కూలీలకు పంచడం జరిగినది.మిస్సమ్మ కాలనీలోని పేదల స్థలాలను కబ్జా చేయాలని అప్పటి పాలకవర్గాల ప్రతినిధులు ప్రయత్నించినప్పుడు వీరికి వ్యతిరేకంగా జరిగే పోరాటం లో ముందు బాగాన ఉండడం తో దీన్ని సహించలేక అసాంఘిక శక్తుల చేత కామ్రేడ్ రామకృష్ణారెడ్డిని 2013 జనవరి ఒకటో తారీఖున హత్య చేయడం జరిగినది.ఈయన మరణం పార్టీకి ప్రజా ఉద్యమాలకు తీవ్ర నష్టము ఆయన లేని లోటు పార్టీలో ఇప్పటికీ తీవ్రంగా ఉన్నది.రాష్ట్ర%శీ%లో ఎన్డీఏ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా ప్రజల పైన రెండుసార్లు కరెంటు చార్జీలు పెంచి దాదాపు 16 వేల కోట్ల రూపాయలు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల నుండి దోచుకోవడం జరుగుతున్నది. నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు అధిక రేట్లు ఉండడంతో ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉన్నారు. పేదలకు విద్య,వైద్యం అందని పరిస్థితిని ఉన్నది. రాయలసీమను,ఉత్తరాంధ్ర ప్రాంతాలను అభివృద్ధి చేయకుండా అమరావతి ప్రాంతానికి వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం జరుగుతున్నది.పరిపాలన ను,అభివృద్ధిని వికేంద్రీకరణ చేయకుండా రాయలసీమ ప్రాంతాన్ని ఎన్డీఏ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని చూపుతున్న ది.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క వైఖరి వలన ప్రాంతాల మధ్య వైశ్యమ్యాలను సృష్టించడం జరుగుతున్నది.దీనికి వ్యతిరేకంగా రాయలసీమ ప్రాంత అభివృద్ధి,పరిపాలన వికేంద్రీకరణ కోసం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపుని స్తున్నాము.ఇంకా ఈ కార్యక్రమంలో రఘునాథ రెడ్డి,జిలాన్, ఎర్రిస్వామి,దావీదు మాట్లాడడం జరిగినది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఐ ఎఫ్ టి యు పట్టణ అధ్యక్షులు హనుమం తు,రఘు,భాష,షేక్షావలి, నారాయణ,రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## సి.పి.ఎం నూతన జిల్లా కార్యదర్శిగా జే.ఎన్.వి.గోపాలన్, ఏకగ్రీవ ఎన్నిక.






**పోడూరు/భీమవరం. జనవరి 5,ప్రజాజ్యోతి న్యూస్.** సి.పి.ఎం.పశ్చిమగోదావరి జిల్లా నూతన కార్యదర్శిగా భీమవరం కు చెందిన జే.ఎన్.వి.గోపాలన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మూడు రోజులుగా భీమవరం లోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా 26 వ.మహాసభలు ఆదివారం ముగిసాయి.ఈ సందర్భంగా రాబోయే మూడు సంవత్సరాలకు గాను 25 మందితో నూతన జిల్లా కమిటీని జిల్లా నలుమూలల నుండి హాజరైన 300మంది ప్రతినిధులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శి గా ఎన్నికైన గోపాలన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్. ఎఫ్. ఐ. అధ్యక్షునిగా, డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శిగా కూడా సేవలందించారు. ప్రస్తుతం సీఐటీయూ జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. అలాగే నూతన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గా బి.బలరాం, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, బురిడి వాసుదేవరావు, పి.వి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు లు, జిల్లా కమిటీ సభ్యులుగా దూసి కళ్యాణి,ధనికొండ శ్రీనివాస్, గొర్ల రామకృష్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టిరామాంజనేయులు, ముచ్చర్ల త్రిమూర్తులు, కానేటి బాలరాజు, సూర్నీడి వెంకటేశ్వరరావు, ఎ.అజయకుమారి,పొగాకు పూర్ణ,కె.తవిటి నాయుడు, కేతా పద్మజ,కె.క్రాంతి బాబు, కామన మునిస్వామి, శేషపు అశ్రియ్య,ఇంజేటి శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు.

## యువత క్రీడారంగంలో ముందుండాలి

**క్రీడలతో దేశ ప్రగతి పెంపొందుతుంది**

**మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయి**

**మేజర్ పంచాయతీ సర్పంచ్ సర్పంచ్ రేగిడి లక్ష్మీ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్**





**పొందూరు , జనవరి 5:** క్రీడారంగం లో యువత ముందంజలో ఉండాలని,క్రీడలతో దేశ ప్రగతిని పెంపొందించగలమని మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ అన్నారు. పొందూరు పంచాయతీ జోగన్నపేట సూర్యోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో తండ్యాం సమీపంలో గల సన్ సిటి వద్ద మెగా టోర్నమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో 32 జట్లు తలపడనున్నాయి . స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మీ , చిగిలపల్లి రామ్మోహన్ ముఖ్య అతిధులుగా పాల్గొని టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం తో పాటు స్నేహభావం పెరుగుతుందని తెలిపారు.క్రీడలు ఆరోగ్య రక్షణకు ఎంతో సహకరిస్తాయని పేర్కొన్నారు.యువత చదువు తో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని సూచించారు. క్రికెట్ టోర్నమెంట్ లో యువకులు తమ ప్రతిభను కనబరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి , చందక ఆది , రాంబిల్లి రాంబాబు , వడగా మోహన్ , కాలెపు శ్రీనివాస రావు , మద్దిల శ్రీనివాస రావు, జోగన్నపేట యూత్ పాల్గొన్నారు.

## మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వం.

**రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన మంత్రి నిమ్మల.**



**పాలకొల్లు. జనవరి 5.ప్రజా జ్యోతి (కొట్టి రామం)** మహిళా సాధికారిత లక్ష్యంగా మహిళలకు ఆర్థిక పరిపుష్టి కల్పించింది తెలుగుదేశం ప్రభుత్వం అని రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి డాక్టరు నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రూ 6 లక్షల 25 వేల రూపాయలు విలువ గల హై స్పీడ్ కమర్షియల్ కుట్టుమిషన్లు 25 మంది మహిళలకు ఉచితంగా మంత్రి నిమ్మల రామానాయుడు అందించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు హై స్పీడ్ కుట్టు మిషన్ పై స్వయంగా బట్టలను కుట్టి మహిళను ఉత్సాహపరిచారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలో మన ఆంధ్రప్రదేశ్ లోనే డ్వాక్రా సంఘాలు నెలకొల్పి, మహిళలకు పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని తెలిపారు.హై స్పీడ్ కుట్టు మిషన్ పొందిన మహిళలు రోజువారి ఆదాయంతో పాటు మరింత ఆదాయం పొందవచ్చునని అన్నారు. ఈ సందర్భంగామహిళలకు హై స్పీడ్ కుట్టు మిషన్ పై కుట్టటం శిక్షణ ఇచ్చిన రోటరీ క్లబ్ ప్రతినిధులను మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు చవ్వాకుల సూర్య నరేష్ బాబు, పవన్,రావూరి సుబ్బారావు, మండేల ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు దల్లిపేట లో ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యటన

**– రెవెన్యూ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొనున్న కూన రవి**

**– గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**– పార్టీ కేడర్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్**



**పొందూరు ,జనవరి 5 :** నేడు పొందూరు మండలం దల్లిపేట గ్రామంలో ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్ పర్యటించనున్నారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ పత్రికా ప్రకటన లో తెలిపారు. భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా దల్లిపేట గ్రామంలో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొనున్నారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామ్మోహన్ పిలుపునిచ్చారు. వీరితో పాటు మండలానికి చెందిన సర్పంచులు , ఎంపిటిసిలు,వివిధ హోదాలలో గల నాయకులు , కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నేడు పలు సమస్యలపై గ్రీవెన్స్ లో కలెక్టర్ కు పిర్యాదు

**సమస్యలు ఉన్న నియోజవర్గ ప్రజలు గ్రీవెన్స్ కు చేరుకోవాలి**

**ఆమదాలవలస సమన్వయ కర్త చింతాడ రవికుమార్**



**ఆమదాలవలస , జనవరి 5 ,ప్రజా జ్యోతి న్యూస్:** నేడు సోమవారం నాడు శ్రీకాకుళం పట్టణంలో జరగనున్న గ్రీవెన్స్ కార్యక్రమంలో పలు సమస్యలకు పరిష్కారం దిశగా కలెక్టర్ కు పిర్యాదు చేయడం జరుగుతుందని ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ పత్రికా ప్రకటన లో తెలిపారు. నియోజవర్గానికి సంబంధించి ఎటువంటి సమస్యలు వున్నవారైనా కలెక్టరేట్ కు ఉదయం 11 గంటలకు చేరుకోవాలని అన్నారు. ప్రజా సమస్య ఏదైనా వైసిపి పార్టీ ప్రజల కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

## క్యాన్సర్ బాధిత వృద్ధునికి వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం.



**పాలకొల్లు. జనవరి 5. ప్రజా జ్యోతి. (కొట్టి రామం)** క్యాన్సర్ బాధిత పేద వృద్ధునికి వైద్య చికిత్సకు వసుధ ఫౌండేషన్ రూ పదివేలు ఆర్థిక సాయం అందించింది. మొగల్తూరు మండలం కోమటి తిప్ప గ్రామానికి చెందిన పేద వృద్ధుడు ఎస్ నరసింహమూర్తి ( 70) కొంతకాలంగా పేగు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయాన్ని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు క్యాన్సర్ తో బాధపడుతున్న వృద్ధుడు నరసింహామూర్తి కి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం గా రూ 10 వేల చెక్కు పాలకొల్లులోని వసుధ ఫౌండేషన్ కార్యాలయానికి పంపించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెనుమత్స బుద్ధరాజు ఆదివారం నరసింహమూర్తికి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా నరసింహా మూర్తి , అతని కుటుంబ సభ్యులు వసుధ ఫౌండేషన్ చైర్మన్ వెంకట రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు పాతపట్నం శాసనసభ్యులు పలు కార్యక్రమాలలో పాల్గొంటారు.



**మెలియాపుట్టి ప్రజా జ్యోతి జనవరి 05:** పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు నేడు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు నివగాం హైస్కూల్లో 68వ నియోజకవర్గ బాలబాలికల క్రీడా పోటీలలో పాల్గొంటారు. అనంతరం 11:30 నిమిషాలకు వసప కేజీబీవీ స్కూల్ ఆవరణలో కంప్యూటర్ ల్యాబ్ రూమ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని, మధ్యాహ్నం 12 గంటలకు కొత్తూరు, ఒంటిగంటకు హిరమండలం జూనియర్ కాలేజీలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలో ఉన్న కూటమి నాయకులు పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు.

## విశిష్టమైన వ్యక్తి అనిల్ చంద్ర పునేఠా



**శ్రీకాకుళం ,జనవరి 5 ,ప్రజా జ్యోతి న్యూస్:** శ్రీకాకుళం జిల్లా పూర్వ కలెక్టర్ గా సుదీర్ఘ కాలం పనిచేసి సేవలందించిన అనిల్ చంద్ర పునేఠా ఉత్తరాఖండ్ రాష్ట్రం నుండి ప్రచురితమైన ప్రఖ్యాత హిల్ మెయిల్ సంచిక ప్రచురించిన 50 మంది విశిష్ట వ్యక్తుల జాబితాలో 41 వ వ్యక్తిగా స్థానం సంపాదించుకున్నారు. ఈ ఎంపిక చేసిన 50 మంది వ్యక్తులు భారతదేశంలో వివిధ రంగాలకు చెందిన వివిధ ప్రాంతాల వారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం తో పాటు భారతదేశానికి వీరంతా ఎనలేని సేవలు అందించినట్లు సంచిక పేర్కొంది. ప్రచురించిన 50 మంది జాబితాలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాద్ దాస్ ప్రథమ స్థానంలో ఉండగా అనిల్ చంద్ర పునేఠా 41 స్థానంలో ఉన్నారు. పునేఠా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ గా దాదాపు మూడున్నర ఏళ్ల పాటు విశేషమైన సేవలందించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా పునేఠా పేరు తెలియని వారు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో ఉన్నతమైన పదవులు నిర్వర్తించిన పునేఠా ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అనంతరం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో సమాచార హక్కు చీఫ్ కమీషనర్ గా గణనీయమైన సేవలు అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పునేఠా విజిలెన్స్ కమీషనర్ గా ఎంపికయ్యారు. భవిష్యత్ లో పునేఠా మరింత ఉన్నత పదవులను పొందాలని డిప్యూటీ కలెక్టర్ బి దయానిధి , విశ్రాంత జె.సి.పి. రజనీ కాంతారావు , ఇంటాక్ ప్రతినిధి కె.వి. జె రాధా ప్రసాద్ తదితరులు ఆకాక్షించారు.

# రక్తం ఎరుపు ఉన్నంతకాలం ఎర్రజెండా రెపరెపలు!

వందేళ్ల చరిత్ర ఎర్రజెండా పార్టీది. ..

దున్నే వాడిదే భూమి అంటూ నినదించిన పార్టీ ఎర్రజెండా. ..

మతోన్మాదమే బిజెపి అజెండా

పేదోడికి అండగా సిపిఐ పోరాటాలకు రామకృష్ణ పిలుపు



**అనంతపురం జిల్లా జనవరి 5 ప్రజా జ్యోతి:** స్వాతంత్రోద్యమానికి పూర్వం భూ పోరాటాలు,పెత్తందారులు, రజాకార్లకు వ్యతిరేకంగా బ్రిటిష్ పాలనకు ఎదుఠెడ్డి నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్లు పూర్తి అయ్యాయని,మరో వందేళ్లయిన చరిష్మా తగ్గకుండా ఉద్యమాలు చేస్తూనే ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కే రామకృష్ణ అన్నారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం కుందుర్పి మండలం బెస్తరపల్లి లో అమరవీరుల స్తూప ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన ఆయన బహిరంగ సభ ఉద్దేశించి మాట్లాడారు. అంతకుముందు కళ్యాణదుర్గం, తూముకుంట, బెస్తరపల్లిలో ఏఐఎస్ఎఫ్, ప్రజా సంఘాల నాయకులు బైక్ ర్యాలీలతో ఎర్ర జెండా పట్టుకుని ఊరేగింపుగా రాష్ట్ర,జిల్లా నాయకత్వాన్ని స్వాగతం పలికారు. బెస్తరపల్లిలో అమరవీరుల స్థూపావిష్కరణ చేసిన అనంతరం నూతనంగా నిర్మించిన సిపిఐ కార్యాలయం,గ్రంధాలయం ప్రారంభించారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో స్థానిక సీనియర్ నాయకులు ఓబులపతి బీకే గోపాల్ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్,జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శిలు నారాయణ స్వామి,మల్లికార్జున జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప , కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు,రాజారెడ్డి, కేశవరెడ్డి,పద్మావతి,మాజీ ఎంపీపీ గిరిజ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అమరవీరుల పేరు మీద బెస్తరపల్లిలో జరుగుతున్న కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని గుర్తు చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా గత వందేళ్లుగా జరుగుతున్న భూ పోరాటాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న బెస్తరపల్లి భూ పోరాటంలో పేదలకు 45 వేల ఎకరాల భూమి పంచిన ఘనత ఇక్కడ నాయకత్వాని కి దక్కుతుందని ఐదుల్లు సదాశివన్,బంగి ఎర్రిస్వామి, బంగి రామప్ప పిఎస్ శర్మ, బిటి రామన్న ,గోవిందప్ప, చెట్ల రుద్రప్ప, లింగన్న, నాగిరెడ్డి , నారాయణరెడ్డి, తిమ్మప్ప తదితరులకు దక్కుతుందన్నారు. దేశంలో వందేళ్ళ చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ , కాంగ్రెస్ పార్టీలు మాత్రమే స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాయని ఆయన గుర్తు చేశారు.రాయల్ నేవీ తిరుగుబాటు ఉద్యమంలో ఓడలపై ఎర్రజెండా ఎగురవేసి నిరసన తెలిపిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కు. భూమి కోసం , భుక్తి కోసం, దున్నే వారికే భూమి అనే నినాదంతో రక్త తర్పణం చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని గుర్తు చేశారు.అధికారంలో ఉన్నా, లేకున్నా కష్టజీవుల కోసం నిలబడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. చరిత్ర లేని బిజెపికి దేశాన్ని పాలించే అర్హత లేదని, బిజెపి ది మతోన్మాద అజెండానే కాని, పేద ప్రజల అభివృద్ధి అజెండా కాదు అన్నారు.ప్రజల మధ్య చీలిక తెచ్చి కుల మతాలను రాజేసి,ఓట్లు రాబట్టుకొని అధికారంలోకి వస్తున్న మోడీ హిందువులకు చేసింది ఏమీ లేదన్నారు.ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల్లో రైతులు మద్దతు ధర కోసం ధర్నా చేస్తా ఉంటే పట్టనట్లు వ్యవహరిస్తున్నార ని,ధరల పెరుగుదల,పేదరికం, నిరుద్యోగం పై ఏనాడూ మాట్లాడరన్నారు. ముస్లిం, మైనార్టీలు, క్రైస్తవులు,, సిక్కులు ఇలా వేర్వేరుగా రాజకీయం చేసి అధికారంలోకి వస్తున్నారని అన్నారు.143 కోట్ల జనాభా కలిగిన భారత దేశంలో మెజార్టీ గా ఉన్న హిందువులకు బిజెపి ప్రభుత్వం చేసింది ఏమీ లేదన్నారు.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లో ఉంది కనుక దేశంలో అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్, నెహ్రూ,గాంధీ లాంటి వారిని కించపరుస్తూ నీచ రాజకీయాలకు ఒడిగడుతున్నారని దుయ్యబట్టారు. స్వాతంత్రోద్యమంలో పోరాటాలు త్యాగాలకు వెళ్లి, జైళ్లకు వెళ్లి వచ్చిన వారిని కించపరుస్తూ పబ్బం గడుపుతున్న బిజెపి ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు సరైన గుణపాఠం చెప్తారని అన్నారు. రాష్ట్రంలో గత ఏడాది అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గజిని కంటే ఎక్కువ మతిమరుపు ఉన్న వ్యక్తి అని దుయ్యబట్టారు. జగన్ దుర్మార్గ పాలన , నియంత లాగా మారిన ఆయన ప్రభుత్వాన్ని గద్దె దించి చంద్రబాబుకు పట్టం కడితే ఎన్నికల హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. ఎన్నికలకు ముందు రాష్ట్రం దివాలా చేసింది అని, శ్రీలంక కన్నా ఎక్కువ అప్పుల పాలయ్యామని నమ్మబలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక మంత్రి ద్వారా రూ. 2.90 లక్షల కోట్ల బడ్జెట్ ఎలా పెట్టారని నిలదీశారు . 15486 వేల కోట్లు కరెంటు చార్జీలు పెంచడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇదే జరిగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. గోదావరి జలాలు రాయలసీమకు తీసుకురావడానికి ప్రైవేట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న చంద్రబాబు తప్పుల మీద తప్పు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు గిట్టుబాటు ధర, పంట నష్టపరిహారం కల్పించలేని ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సినిమా టికెట్లు రేట్లు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపడానికి పూనుకోవడం సిగ్గుచేటు అన్నారు.రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ శత వార్షకోత్సవాన్ని జరుపుకుంటున్న కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో పాల్గొన్న వారిని స్మరించుకుంటూ వారు పోరాటపతిమాను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మరింత ప్రజలకు సేవ చేయడానికి కృషి చేస్తుందన్నారు. దున్నేవాడికే భూమి, ఇళ్ల స్థలాలు , రేషన్ కార్డులు పేదవారికి అందేదాకా ఎర్రజెండా పార్టీ ఉద్యమాలు కొనసాగిస్తుంద న్నారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ త్యాగాలకు మారుపేరుగా కమ్యూనిస్టులు నిలబడతా రని అనంతపురం జిల్లా లాంటి కరువు ప్రాంతంలో గంజి కేంద్రాలు పెట్టి పేదలను ఆదుకుని, ఉద్యమాలు చేసిన ఈ ప్రాంత పోరాట యోధులను స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.

# ఏపీలో ఎస్సీ లెక్కల మిస్సింగ్...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కసరత్తు గందరగోళంగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో వాలంటీర్లు నిర్వహించన కులగణన ఆధారంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కసరత్తు చేయడం ఈ గందరగోళానికి కారణమైంది.2024 జనవరి మరియు ఫిబ్రవరి నెలలలో రాష్ట్రంలోని అన్ని కులాల సామాజిక ఆర్థిక పరిస్థితులు తెలుసుకోడానికి అప్పటి వైసీపీ ప్రభుత్వం వాలంటీర్లతో సర్వే చేయించింది. ఈ సర్వేను వాలంటీర్లు డోర్ టు డోర్ తిరిగి చేయలేదని, వాళ్ళ పరిధిలో నివసించే వారి కుటుంబ వివరాలను వారికి తెలిసినంత వరకూ రాసుకున్నారని? ఒక మాదిరి చిన్న పట్టణాల నుండి పెద్ద పట్టణాల వరకూ అసలు ఎన్యూమరేషన్ చేయలేదని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. అయితే ఎన్నికలు సమిపించడంతో వైసీపీ ప్రభుత్వం ఈ సర్వే వివరాలను పబ్లిష్ చేయలేదు.ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఈ సర్వే లోని ఎస్సీ కులాల డేటాను తీసుకుని ఫిజికల్ కాపీలను ఆయా గ్రామ వార్డు సచివాలయాల వారీగా నోటీస్ బోర్డు లో డిసెంబర్ 26, 2024 న ప్రకటించి అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 31, 2024 లోపు తెలియచేయాలని అంటే 5 రోజుల సమయం ఇచ్చారు. దీనిపై ప్రచారం మాత్రం చేయలేదు. ఈ జాబితాలు ఎందుకు ప్రకటిస్తున్నారనే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించలేదు.వైసీపీ హయంలో వాలంటీర్లు నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా దళితుల్ని పెద్ద సంఖ్యలో క్రైస్తవులుగా నమోదు చేశారని, కుటుంబాల వారీగా కులాల నమోదు చేయడంలో ఉద్దేశపూర్వకంగా తప్పు ఎంట్రీ చేశారని, ఒక కులానికి బదులు ఇంకొక కులం రాశారని అసలు చాలా చోట్ల ఎన్యూమరేషన్ చేయలేదని గ్రామ వార్డు స్థాయిల నుండి ఫిర్యాదులు అందుతున్నాయి.మరోవైపు గత ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వే నివేదికలను ఆయా గ్రామ వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో ఉంచారనే సంగతి 90 శాతం మందికి తెలియదు. తమ వివరాలను తనిఖీ చేసుకున్న వారిలో కూడా అత్యధికంగా తప్పుగా నమోదు చేశారని ఫిర్యాదులు వెల్లువెత్తాయి.తమ కులం, మతం వివరాలు తప్పుగా నమోదు అయ్యాయని ఆయా గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందిని అడుగుతుంటే వాటిని సరిచేయడానికి డాక్యుమెంట్స్ కావాలని, రుజువులు సమర్పించాలని సతాయిస్తున్నారని జనం వాపోతున్నారు.అసలు డోర్ టు డోర్ సర్వే తాము చేయలేదని తమకు తెలిసిన వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేసినట్టు వాలంటీర్లు చెబుతున్నారు. కులాల వారీగా సర్వే చేయించిన అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ సర్వేను పబ్లిష్ చేసే సాహసం కూడా చేయలేదు. అదే సర్వేఆధారంగా ఎస్సీ కులాల జనాభాను నిర్ధారణకు రావడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.2015 వ సంవత్సరంలో ఇదే ఎన్డీఏ ప్రభుత్వం జీఓ నెంబర్ 25 ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాల ఎస్సీ జనాభా లెక్కలను జిల్లాల వారీగా ప్రకటించి, ప్రభుత్వం అందిస్తున్నసంక్షేమ పథకాలను ఆయా ఎస్సీ ఉపకులాల జనాభా ప్రకారం అందించాలని నిర్ణయించింది. 2011 జనాభా లెక్కలను దీనికి ప్రాతిపదికగా తీసుకున్నారు.కుల గణన, అందులోనూ ఎస్సీల కుల గణన క్యాస్ట్ సర్టిఫికెట్స్ ఆధారంగా చట్ట ప్రకారం సూచించబడిన అధీకృత సంస్థతో, నిర్దేశించిన విధివిధానాలతో, మల్టీ లెవెల్ క్రాస్ వెరిఫికేషన్ చేసి అభ్యంతరాలను స్వీకరించి, వైడ్ పబ్లిసిటీ ద్వారా అందరిలో అవగాహన కల్పించి చేయాల్సిన ప్రక్రియను చట్టబద్ధత లేని వాలంటీర్లతో నిర్వహించడం, ఎస్సీల జనాభా సంఖ్యను నిర్దేశించడానికి వాడటంపై అభ్యతంరాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ సర్వే గణంకాలపై అభ్యంతరాలు స్వీకరిస్తున్నారనే సమాచారం కూడా ప్రజలకు లేకపోవడాన్ని అయా వర్గాల ప్రజలు తప్పు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనాభా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం, ప్రతి ఇంటిలో జనాభా వివరాలు మ్యాపింగ్‌లో నమోదై ఉండటంతో ప్రతి ఒక్కరికి ఆన్‌లైన్‌లో వాటిని స్వయంగా తనిఖీ చేసుకునే సదుపాయం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# ఒకరికి ఒకరు.... కొనసాగుతున్న స్నేహబంధం

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలకు ముందు అనేక ఊహాగానాలు వినిపించాయి. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలవబోరని దాదాపు చాలా మంది అంచనా వేశారు. బీజేపీ ఏదో ఒకటి చేసి కూటమి ఏర్పాటు కాకుండా చూసుకుంటుందన్నభరోసాలో దిలాసాగా వైసీపీ నేతలు కూడా ఉన్నారు.చివరకు పట్టుబట్టి సాధించి మరీ కూటమిని ఏర్పాటు చేశారు. అయితే కూటమి ఏర్పాటు తర్వాత కూడా దీనిపై అనేక రకాలుగా ప్రచారం సాగింది. అభ్యర్థుల ఎంపికలోనూ, సీట్ల కేటాయింపుల్లోనూ విభేదాలు తలెత్తుతాయని భావించారు.కానీ ఎన్నికలకు చాలా కంఫర్ట్ గా మూడు పార్టీలు కలిసి వెళ్లడంతో ఆశలు పెట్టుకున్నవాళ్లంతా అవాక్కయ్యారు. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఈరకమైన ప్రచారం ఆగలేదు. మంత్రి వర్గం ఏర్పాటు దగ్గర నుంచి మొదలయిన ఈ ప్రచారం ఇంకా సాగుతూనే ఉంది. అసంతృప్తులు బయలుదేరుతాయని ఎవరికి వారు ప్రత్యర్థులు అంచనా వేసుకున్నారు. కానీ అంతా సాదాసాదీగా, సాఫీగా జరిగిపోయింది. ఇక నామినేటెడ్ పోస్టుల భర్తీ సమయంలోనూ అనేక వదంతులు షికార్లు చేశాయి. నామినేటెడ్ పోస్టుల కోసం ఇటు జనసేన, అటు బీజేపీ పట్టుబడుతుందన్న ఊహాగానాలు చెలరేగగా అవి ఊహలకే పవన్, చంద్రబాబులు పరిమితం చేశారు. నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఎలాంటి అసంతృప్తులు రాలేదు. ఒకవేళ పార్టీ నేతల్లో ఉన్న ఇంకా అనేక పదవులు వచ్చేవి ఉండటంతో మౌనంగా ఉన్నారన్నా అనుకోవాలి. కానీ ఇక్కడ ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి... అగ్రనేతలు అందరూ కలసి కట్టుగానే ఈ ఏడు నెలల నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. ఎక్కడా కొద్దిగా కూడా పొరపొచ్చాలు రాలేదు. అనేక నిర్ణయాలు తీసుకున్నా ఇటు పవన్ కల్యాణ్ నుంచి కూడా పెద్దగా వ్యతిరేక వ్యాఖ్యలు వెలువడలేదు. ఒకహోంశాఖపైనే ఆయన నేరుగా కామెంట్ చేయడం కొంత కలకలం రేపింది. ఎందుకంటే హోంశాఖను నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షిస్తుండటంతో తేడా కొట్టిందన్న కామెంట్స్ వినపడ్డాయి. కానీ చంద్రబాబు వెంటనే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టి తామిద్దరమూ ఒక్కటేనన్న సంకేతాలను ఇటు పార్టీ నేతలకు, అటు ప్రత్యర్థులకు బలంగా పంపగలిగారు. ఇద్దరూ ఇప్పటి వరకూ ఏ అంశంపైనా విభేదించుకున్న దాఖలాలు లేవు. ఇకముందు కూడా ఉండవన్న ధీమా ఆ పార్టీల క్యాడర్ లో కనపడుతుంది. ఎందుకంటే పవన్ అడిగింది చంద్రబాబు కాదనడం లేదు.. అలాగే చంద్రబాబు చెప్పినదానికి పవన్ కల్యాణ్ ఓకే అని చెబుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. పట్టు విడుపులతో ఇద్దరు ప్రయాణిస్తున్నారు.

## వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు

స్వాగతం పలికిన స్థానిక ఎమ్మెల్యే, ఆలయ ఈఓ



**అనంతపురం జిల్లా జనవరి 5 ప్రజా జ్యోతి:** చిత్తూరుజిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, కాణిపాకంలో కొలువుదీరిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని మడకశిర నియోజకవర్గ శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు శ్రీ ఎం.ఎస్.రాజు ఆదివారం దర్శించుకున్నారు. ఎం.ఎస్.రాజు కి స్థానిక పూతలపట్టు శాసనసభ్యులు కె.మురళీ మోహన్ స్వాగతం పలికి ఆలయంలోకి మర్యాదపూర్వకంగా వెంటబెట్టుకుని తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు కి ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎం.ఎస్.రాజు కి స్వామివారి హారతి, తీర్థ ప్రసాదాలను అందించారు. స్వామి వారి దర్శనం అనంతరం ఎం.ఎస్.రాజు కి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈఓ స్వామివారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. ఎం.ఎస్.రాజు తో పాటు స్వామివారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు పి వెంకటప్ప, దరూర్ ఓబుల నాయుడు, నాగరాజు, ఆది నరసింహులు, శ్రీనివాసులు, గణేష్, శివ, తదితరులు దర్శించుకున్నారు.

## అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందాలి - కలెక్టర్



**బాపట్ల జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** అర్హులైన లబ్ధిదారులకే పింఛన్లు అందాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు ఆదివారం తన చాంబర్లో సంబంధిత అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారుల వివరాలు పునః పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ చేయుచున్న వివిధ రకాలైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అనర్హులు కూడా పొందుచున్నారు అని సదరు పించనుదారుల అర్హతలను తిరిగి పరిశీలించాలని చెప్పారు క్షేత్రస్థాయి నుండి ఫిర్యాదుల అందినదృష్ట్యా ప్రభుత్వం వారు ముందస్తుగ ఆరోగ్య మరియు దివ్యాంగుల పించనుదారులకు సంబందించిన అంగవైకల్యం ను పునఃపరిశీలన చేసి వివిధ విభాగాలకు చెందిన వైద్యులను టీము గా ఏర్పాటు చేసి పక్షవాతం మరియు యాక్సిడెంట్ తదితరాలు వలన మంచానికే పరిమితమైన వారిని వారి ఇళ్ళ వద్దనే పరిశీలన చేయటకు నియమ నిభందనలను విడుదల చేసి ది.06-01-2025 నుండి పరిశీలన నిర్వహణ మొదలు పెట్టవలసినదిగా తెలియజేశారు పైన తెలిపిన విషయాల దృష్ట్యా బాపట్ల జిల్లాకు కేటాయించబడిన మూడు వైద్య బృందాలతో షెడ్యూల్ నందు తెలిపిన విధంగా 25 మండలాలలో ఉన్న 643 మంది నడవలేని స్థితి లో మంచానికే పరిమితమై ఉండి రూ.1500 చొప్పున పించను తీసుకునే పించనుదారుల యొక్క అంగవైకల్య శాతం ను పునః పరిశీలనను ది.06-01-2025 నుండి ది.28-01-2025 వరకు చేయవలసినదిగా సంబంధిత అధికారులను ఆదేశించారు జాబితా నందు గల అందరూ పించనుదారులు సహకరించి సదరు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

## రైల్వే జోన్ డీపీఆర్ పై రాని క్లారిటీ...

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్రలోని విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రావడం లేదు. ప్రతిసారి రైల్వే జోన్ అంటూ ఏదో ఒక అప్‌డేట్ వస్తుంది, కానీ కనీసం శంకుస్థాపన కూడా జరగలేదు. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక గతంలోనే సిద్ధం చేసినా ఇంకా ఆమోదం రాకపోవడం హాట్ టాపిక్ అవుతోంది. అసలే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ పర్యటన ఫిక్స్ అని, ఆయన రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేస్తారన్న ప్రచారం స్థానికంగా ఊపందుకుంది. తీరా చూస్తే డీపీఆర్‌కు ఆమోదం రాకుండా, శంకుస్థాపన జరుగుతుందా.. ఇంతకీ ప్రధాని మోదీ వస్తారా లేదా కొత్త టెన్షన్ మొదలైంది. 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనరకు రానున్నారని, విశాఖ రైల్వే జోన్ పనులకు శంకుస్థాపన చేస్తారని ప్రచారం జరుగుతోంది. కానీ రియాలిటీకి వస్తే ముందు డీపీఆర్‌పై ఎటూ తేలలేదు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రం ఫిబ్రవరి 2019లోనే ప్రకటింటించి. అదే ఏడాది డీపీఆర్ ను కూడా రూపొందించారు. రైల్వే జోన్ స్వరూపాన్ని చూపించే డీపీఆర్ మాత్రం ఇంకా ఆమోదం పొందలేదు. గతంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. కేంద్రం సిద్ధంగా ఉందని, అప్పటి వైసీపీ ప్రభుత్వం భూములు కేటాయించి ఇవ్వలేదని పేర్కొనడం రాజకీయంగా సంచలనం రేపింది. గతంలో ఆరిలోవ ప్రాంతంలో రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనానికి ప్రతిపాదనలు పంపినా కేంద్రం అందుకు ఆమోదించలేదన్న వాదన ఉంది. విశాఖ జోన్ లో వాల్తేరు డివిజన్ ఉంటుందా, లేదా అని క్లారిటీ రావాల్సి ఉంది.2022లో జోన్ ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణానికి డీఆర్ఎం ఆఫీస్ ఎదురుగా ఉన్న వైర్ లెస్ కాలనీ ఎంపికైంది. మొత్తం 13 ఎకరాల్లో 8 ఎకరాలలో హెడ్ క్వార్టర్స్ డిజైన్లను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదించారు. అంతా ఓకే అనుకునే లోపు 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్ గా శంకుస్థాపన చేయాల్సి ఉండగా.. చివరి నిమిషంలో ఆగిపోయింది.దక్షిణ కోస్తా రైల్వే జోన్ తో పాటు వాల్తేరు డివిజన్ లో కొంత భాగం, ఈస్ట్ కోస్ట్ లోని కొంత భాగంతో కొత్తగా రాయగడ డివిజన్ ను ప్రకటించారు. రైల్వే జోన్ కోసం రూ.106కోట్లు ప్రకటించగా.. రాయగడకు మాత్రం రూ.70కోట్లు మంజూరైంది. వాల్తేరు రైల్వే డివిజన్ ను విజయవాడ డివిజన్ లో కలిపి మొత్తం రూట్లు, లైన్లు ఖరారు చేశారు. రాయగడ డివిజన్ లైన్లు ఇప్పటికే ఖరారైనట్టు సమాచారం. జనవరి 6న ప్రధాని మోదీ వర్చువల్‌గా రాయగడ డివిజన్ కు శంకుస్థాపన చేయనున్నారని వినిపిస్తోంది.జనవరి 8న ప్రధాని మోదీ ఏపీ పర్యటనకు రానున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. విశాఖ రైల్వే జోన్ భవనానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ క్రమంలోనే ఏపీకి సంబంధించి ఏమైనా ప్రకటన చేస్తారా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

## పీబీ సిద్ధార్థ కళాశాలలోఅండర్-19

# బాలికల స్కూల్ గేమ్స్ నేషనల్ వాలీబాల్ టోర్నమెంట్






**ఐదు రోజుల పాటు జరిగే ఈ టోర్నీ కోసం విజయవాడ చేరుకున్న 25 రాష్ట్రాల జట్లు**

**ఫ్లడ్‌లైట్ల వెలుగులోవ టోర్నమెంట్ నిర్వహణ, నాలుగు ఫ్లడ్‌లైట్ కోర్టులతో సహా ఆరు కోర్టులు సిద్ధం**

**స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఏపీ కార్యదర్శి భానుమూర్తి రాజు**

**విజయవాడ జనవరి 5:** అండర్-19 బాలికల కోసం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌కు విజయవాడ నగరం ఆతిథ్యం ఇవ్వడానికి సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి 10 వరకు విజయవాడలోని మొగల్‌రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ టోర్నీ జరగనుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, స్కూల్ గేమ్స్ కృష్ణా జిల్లా అండర్-19 యూనిట్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. దేశంలోని 25 రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది క్రీడాకారిణులు, కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొననున్నారు. టోర్నమెట్ కోసం నిర్వాహకులు పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో ఆరు వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయగా, అందులో ఫ్లడ్‌లైట్లతో కూడిన నాలుగు కోర్టులలో లీగ్ కమ్ నాకౌట్ విధానంలో మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విజయవాడలోని మొగల్‌రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమావేశ మందిరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌జీఎఫ్‌ఏపీ) కార్యదర్శి జి భానుమూర్తి రాజు ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం పీబీ సిద్ధార్థ కళాశాలలో టోర్నమెంట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బీహార్ మినహా మిగిలిన 25 రాష్ట్రాల జట్లు విజయవాడకు చేరుకుని ప్రాక్టీస్‌ను ప్రారంభించాయని చెప్పారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టోర్నీ సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించేందుకు సమగ్ర శిక్షా ద్వారా రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరోవైపు, సిద్ధార్థ అకాడమీ కోర్టుల బాధ్యతను చేపట్టి ఆరు అంతర్జాతీయ స్థాయి కోర్టులను ఏర్పాటు చేసిందని, వాటిలో నాలుగు ఫ్లడ్‌లైట్లతో అమర్చబడి ఉన్నాయని ఆయన చెప్పారువిలేకరుల సమావేశంలో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్‌ఏపీ సహాయ కార్యదర్శులు కేవీ రాధాకృష్ణన్, ఏపీ రాజు, టెక్నికల్ కమిటీ చైర్మన్ డీ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో అంబేద్కర్ ఓపెన్

# యూనివర్సిటీ ని ఏర్పాటుకి కృషి చేస్తాం

**ఎంపి కేశినేని శివనాథ్**

**విజయవాడ జనవరి 5:** ఆంధ్రప్రదేశ్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని ఎంపి కేశినేని శివనాథ్ హామీ ఇచ్చారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డి డాక్టర్ వెలగా జోషి ఆదివారం ఎంపి కేశినేని శివనాథ్ ను కలిసి రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని వినతి పత్రం అందజేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు, ఇప్పటివరకు ప్రభుత్వం దగ్గర జరిగిన చర్చలు, సమీక్షలకు సంబంధించిన సమగ్ర నివేదికను కేశినేని శివనాథ్ కి డాక్టర్ వెలగా జోషి అందజేశారు. నివేదికను పరిశీలించిన తర్వాత కేశినేని శివనాథ్ సానుకూలంగా స్పందించారు. విభజన చట్టంలోని నిబంధనల ప్రకారం 10వ షెడ్యూల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఉంది. పది సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో తెలంగాణలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆంధ్ర ప్రదేశ్ కు సంబంధించిన విద్యార్థులకు ప్రవేశాలు ఇవ్వటం లేదు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ కు చెందిన సుమారు 30 వేలకు పైగా విద్యార్థులు నష్టపోతున్న విషయాన్ని కేశినేని శివనాథ్ దృష్టికి డాక్టర్ వెలగా జోషి తీసుకెళ్లారు. అంతేకాకుండా విద్యార్థులు నష్టపోవడం రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని కోల్పోవడం వంటి అంశాలను వెలగ జోషి ఎంపీకేశినేని శివనాథ్ తో చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేశినేని శివనాథ్ ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు .రాష్ట్రంలో ఉన్న 30 వేల మంది ఓపెన్ యూనివర్సిటీ ద్వారా విద్యను పొందే అవకాశం ఉన్నప్పుడు వారందరికీ తగిన న్యాయం జరిగే విధంగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.



## కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది

**విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి**

**సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల సిబ్బంది విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**



**విజయవాడ జనవరి 5:** విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఆదివారం నాడు విశాఖలోని శ్రీకృష్ణాపురం డా. బి. ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశీలించిన మంత్రి పాటపారిశుద్ధ్య నిర్వహణ లేమి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్న మంత్రి విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా.. ఆయన మాట్లాడుతూ.....విద్యార్థులకు తమ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి అన్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

# రథం లాగిన పరిటాల శ్రీరామ్





**ధర్మవరంలో ఘనంగా సుబ్రమణ్య షష్ఠి వేడుకలు**

**పుర వీధుల్లో స్వామి వారి రథం లాగిన శ్రీరామ్**

**ధర్మవరం జనవరి 5:** శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో పరిటాల శ్రీరామ్ స్వామి వారి రథాన్ని లాగారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర , నాగదేవతల రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వర నమోంనమః అంటూ రథాన్ని లాగారు. పరిటాల శ్రీరామ్ స్వయంగా రథాన్ని లాగారు. పాత బస్టాండ్ వద్ద నుంచి తేరు వరకు శ్రీరామ్ భక్తులతో పాటు ఈ రథాన్ని లాగారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ నిర్వాహకులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు.. ఈ పూజాది కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. స్వామి వారి కృపాకటాక్షాలు ధర్మవరం ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు...



## ధర్మవరం లో బ్రెయిలీ జన్మదిన వేడుకలు

**ధర్మవరం జనవరి 5:** జనవరి 4 వతేది బ్రెయిలీ యొక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు వారోత్సవాల సందర్భంగా నలుగురు అందులను ఘనంగా సన్మానించడం జరిగినది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం లో ధర్మవరం పట్టణ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ నరసింహులు తన కంటి హాస్పిటల్ నందు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేంద్ర రెడ్డి సెక్రటరీ శివయ్య మరియు ట్రెజరర్ సత్యనిర్ధారణ పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఉచిత నేత్ర వైద్యశిబిరం దాత కు ఘనంగా సత్కారం!



**ధర్మవరం జనవరి 5:** ధర్మవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర చికిత్స వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం దాత లయన్ చెన్నంశెట్టి జగదీష్ ప్రసాద్ తమ తండ్రి చెన్నంశెట్టి నాగభూషణం జ్ఞాపకార్థం నిర్వహించడం జరిగింది.దాతలు చెన్నంశెట్టి జగదీష్ ప్రసాద్ ను ధర్మవరం లయన్స్ క్లబ్ వారు ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేసారు.మొత్తం 56 మందికి ఈ ఉచిత వైద్య శిబిరం లో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. వీరిలో 32 మంది అర్హులైన వారిని కంటి పరీక్షలకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ ఎమ్. వేణుగోపాలచార్యులు సెక్రటరీ ఏ. రమేష్ బాబు, ట్రెజరర్ వి. నాగేంద్ర, ఇంకా గూడూరు మోహన్ దాస్, సి. జగదీష్ ప్రసాద్, గోసే రాధాకృష్ణ ఉట్టి శివప్రసాద్, పల్లెం వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా మదనపల్లె.. మహిళా కండక్టర్ గిరిజమ్మ నిజాయితీ..

**రూ.2.5 లక్షలు బంగారు చైను ను అప్పగించిన కండక్టర్**



ఆర్టీసీ బస్సులో ప్రయాణీకుడు జార విడసుకున్న రూ.2.5లక్షల బంగారు గొలుసు మదనపల్లె ఆర్టీసీ మహిళా కండక్టర్ గిరిజమ్మకు దొరికింది.ఆమె ఆ విలువైన బంగారు గొలుసును తీసుకొచ్చి మదనపల్లె టూ టౌన్ సిఐ రామచంద్ర కు రాత్రి అందజేసింది. సిఐ ఆదేశాలతో ఏఎస్ఐ రమణ,పిసి తవలం మహేష్,భద్ర లు గొలుసు జారవిడుసుకొన్న తిరుపతి జిల్లా, రంగంపేటకు చెందిన శివకుమార్ ను మదనపల్లెకు పిలిపించారు. 40 గ్రాముల బంగారు గొలుసును శివకుమార్ కు అప్పజెప్పిన మహిళా కండక్టర్ గిరిజమ్మ ని నిజాయితీని పోలీసులు అభినందించారు.

## సూర్య ఘర్ యోజన పథకం తొలి వాడకం దారుడు జాగంటి నాగరాజు కు మంత్రి సత్కారం!

**ధర్మవరం జనవరి 5:** ప్రధాని నరేంద్ర మోడీ జీ ప్రవేశ బెట్టిన సూర్య ఘర్ యోజన





పథకం ధర్మవరం లో తన ఇంటి పై తొలి సారిగా ప్రారంభించిన వినియోగదారుడు సాయి నగర్ కు చెందిన చేనేత ప్రముఖులు శివానగర్ ఖాది బోర్డు కార్యదర్శి జాగంటి నాగరాజు ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ సత్కరించారు. ఈ విషయం జాగంటి నాగరాజు తెలియజేస్తూ,ఈ పథకం వలన ఎంతో ప్రయోజనం ఉందని కరెంట్ బిల్ వాడకం తగ్గుతుందని మంచి ప్రయోగాత్మక పథకం అని పథకం సృష్టి కర్త మన ప్రధాని నరేంద్ర మోడీ జీ కి ప్రత్యేక ధన్యవాదములు అని ఆయన అన్నారు.

## 6వ తేదీన సింగనమలలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"

**- : డివిజన్ కు సంబంధించి సింగనమల తహసీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహణ**

**- : సింగనమల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,**



**అనంతపురం, జనవరి 05 :** అనంతపురం జిల్లాఈనెల 06వ తేదీన సింగనమలలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఒక ప్రకటనలో తెలిపారు. సింగనమల నియోజకవర్గానికి సంబంధించి సింగనమల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 06వ తేదీన సోమవారం ఉదయం 9 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. సింగనమల నియోజకవర్గ ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఇక్కడ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించడం లేదు.

# నాగలమడక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం




**సుబ్రహ్మణ్య షష్టి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత**

**ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికిన పావగడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి**

**స్వయంగా రథాన్ని లాగిన పరిటాల సునీత**

**అనంతపురం జనవరి 5:** ఆంధ్రా, కర్ణాటక సరిహద్దులోఉన్న సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాగలమడక శ్రీ వళ్ళీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు. నాగలమడకలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి వేడుకలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన పూజాది కార్యక్రమాలు, రథోత్సవంలో ఎమ్మెల్యే సునీత పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు మాజీ మంత్రి వెంకటరమణప్ప, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్, ఆలయ అధికారులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలకగా, పురోహితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా హెూమం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే సునీత స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్ తో కలసి రథానికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు నిర్వహించి శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవాన్ని ప్రారంభించి స్వయంగా కాసేపు రథాన్ని లాగారు. ఆ తర్వాత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలకు అంతా మంచి జరగాలని ఆమె ఆకాంక్షించారు. నాగలమడక వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో జరిగిన షష్టి వేడుకల్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు ఎమ్మెల్యే సునీత తెలిపారు...



## రెండవ రోజు ఆరాధనోత్సవాలు లో

# అలరించిన కౌశితఆరాధ్య, తేజస్విని ల నృత్యం





**అలరించిన మాండలిన్ వాద్య సమ్మేళనం**

**ఘనమైన ఏర్పాట్లుతో 26వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనవరి 05:** అనపర్తి శ్రీ శారదా సంగీత కళా సమితి వారి 26వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాల రెండవ రోజు అనపర్తి కి చెందిన చిరంజీవులు కౌశిత ఆరాధ్య, తేజస్విని ల నృత్యంతో ప్రారంభమై ఆహూతులను అలరించింది. తదనంతరం చెన్నైకు చెందిన విద్వాన్ యూపీ రాజు, విదుషి యు నాగమణి గార్ల మాండలిన్ వాద్య కచేరి జరిగినది. వీరికి వాయిద్య సహకారం విద్వాన్ పారుపల్లి ఫల్గున్ మృదంగంపై, విద్వాన్ హరిబాబు ఘటంపై సహకరించారు. కచేరీ ఆద్యంతం సంగీత ప్రియులకు వీనుల విందు చేసింది. ఈ కార్యక్రమానికి శ్రీ మేడపాటి చెల్లారెడ్డి, శ్రీ తేతలి త్రినాధ రెడ్డి సంయుక్తంగా సౌజన్యం వహించగా, శ్రీ తాడి రామా చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానంతరం కీర్తిశేషులు నల్లమిల్లి రామమోహన్ రెడ్డి, జయలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు రామచంద్రారెడ్డి, వెంకట మునీశ్వర్ రెడ్డి వితరణతో సభకు విచ్చేసిన అందరికీ ప్రసాదం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాలలో సమితి అధ్యక్షులు తమలంపూడి చిన్న ఆదిరెడ్డి, ఉపాధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, సమితి సభ్యులు కర్రి వెంకటరెడ్డి, కర్రి వెంకట రామకృష్ణారెడ్డి, పాలి ఆంజనేయులు, కొవ్వూరి వెంకటరెడ్డి , ఎల్ ఫణి కుమార్ పాల్గొన్నారు.

## ఛలో "హైందవ - శంఖారావం

## బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రిపోర్టర్ జనవరి 05:** తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం నుండి విశ్వ హిందూ పరిషత్ - ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలో జరిగే "హైందవ - శంఖారావం" భారీ బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుండి ప్రజలు తరలివెళ్ళుతున్న 80 బస్సులను రంగంపేట మండలం %బు% రాజాపురంలో జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. విశ్వ హిందూ పరిషత్ - ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలో జరిగే "హైందవ - శంఖారావం" భారీ బహిరంగ సభకు అనపర్తి నియోజకవర్గం నుండి 80 బస్సులలో ప్రజలు భారీగా తరలివెళ్ళడం జరుగుతుంది. అనపర్తి నియోజకవర్గం నుండి భారీగా తరలి వెళ్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.

## పవన్ కళ్యాణ్ పై అభిమానం తో

## జనసేన పార్టీలో 300 మంది చేరిక !



**ధర్మవరం జనవరి 5:** జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలోకి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి సమక్షంలో ధర్మవరం పట్టణంలోని 28 వ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశా మరియు జనసేన పార్టీ వార్డు ఇంచార్జ్ సరితాల భాష ల ఆధ్వర్యంలో మహమ్మద్ ఖాన్,శ్రీరాములు, లక్ష్మి,రామకృష్ణ, కేశవ,వెంకటేష్, గోవింద,రాజు, నరేష్ స్వామి,ఆచారి రామ్మూర్తి, గోపాలు ,మధు, రామ్ తుల్లా,నారాయణస్వామి,యశోద,లక్ష్మి, గడ్డం వెంకటేష్,గడ్డం హరి, ఆచారి వంశీ,శేఖర్ ,అల్లా బకాష్, బాబా ఖాన్,షబ్బీర్,హబీబ్ ఖాన్,గౌరాపురం బాబా ,ఖాసిం వహీదా,షాహద్ ఖాన్,శాష,శ్రీనివాసులు,లక్ష్మీ,హరిదాసు, లక్ష్మి దేవి, జిలాన్ భాష, రాధాకృష్ణ, రంగనాయకులు,పృథ్వి గోవిందరాజు, మనోహర్, శ్రీరాములు భాష,రాజేశ్వరి,వెంకీ, నారాయణస్వామి ,శ్రీనివాసులు, రామాంజి,హరి, ఓబుళపతి, శ్రీనివాసులు,నాగరాజు,కృష్ణప్ప,గోవిందు,గంగ ,రత్నమ్మ,వంశీ, అశోక్,జ్యోతి, పృథ్వి నారాయణస్వామి మరియు తదితరులు చేరారు. ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉంటూ ఏ ఆపద వచ్చిన ముందు ఉంటానని హామీ ఇచ్చారు.

# సంపద సృష్టికర్తలు ప్రధాని మోదీ,ఏపీ సీఎం చంద్రబాబు





**తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారం ...**

**కేంద్ర రైల్వే మరియు జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న**

**విజన్ ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

**ఎంపీ పార్థసారథి మంత్రి సవితమ్మ**

**పెనుగొండ, జనవరి 5:** దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంపద సృష్టికర్తలని కేంద్ర రైల్వే మరియు జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బి.కె.పార్థసారథి,

రాష్ట్ర బి. సి, సంక్షేమం మరియు జౌళి శాఖ మాత్యులు శ్రీమతి సవితమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, పుట్టపర్తి శాసనసభ్యురాలు శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ టీ.ఎస్. చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి , చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రైల్వే అజయ్ శర్మ, అమితేష్ కుమార్ , బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజర్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్ మరియు వివిధ రైల్వే విభాగాలకు చెందిన అధికారులు, కూటమి నాయకులు, రైల్వే ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర రైల్వే సహాయం మంత్రి సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధికి నిర్వచనం అని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం పాటుపడే సు పరిపాలన దక్షత కలిగిన నాయకుడని , చంద్రబాబు అంటే తనకు ఎంతో ఇష్టమని మంత్రి అన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానని మంత్రి తెలిపారు. ఈరోజు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీ సత్య సాయి జిల్లాలో శ్రీకృష్ణదేవరాయ కాలంనాటి రెండవ రాజధానిగా ఉన్న పెనుగొండలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, భారతదేశాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ వంతెన పెనుగొండ పట్టణం అనంతపురం ధర్మవరం మరియు పుట్టపర్తి మధ్య రైల్వే ట్రాక్ల మీదుగా రోడ్డు రాకపోస్తులకు అతుకులు లేకుండా సులభతరం చేస్తున్నదని మంత్రి నేటితో పెనుగొండ వాసుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రి పేర్కొన్నారు. 2021 మార్చి 15 న నిర్మాణం సుమారు రూ.33.50 కోట్లతో 63.4 మీటర్లు అనంతపురం వైపు 443 మీటర్లు మరియు పెనుగొండ వైపు 130 మీటర్ల అప్రోచ్ పొడువుగా ఈ వంతెన నిర్మాణం జరిగి నేడు ప్రజలకు ఉపయోగంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. పెనుగొండ , పుట్టపర్తి ప్రాంతంలో రైల్వే పనుల పై ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతుందని మంత్రి తెలిపారు. చాకర్లపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు, పెనుగొండ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద అవసరమైన పనులు అన్నింటిని 30 రోజుల్లో నిర్మాణాల పనులకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే శాఖ అధికారులను సభ వేదిక నుంచే మంత్రి ఆదేశించారు. అలాగే హిందూపురం ఎంపీ పార్థసారథి,మంత్రి సవితమ్మ, పుట్టపర్తి



ఎమ్మెల్యేపల్లె సింధూర రెడ్డి ల అభ్యర్థనలను మంత్రి స్పందించి ఆయా ప్రాంతాలలో కూడా సత్వరమే రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. అంతకుముందు ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ దాదాపు 40 సంవత్సరాల తర్వాత కేంద్రం నుండి రైల్వే శాఖ మంత్రి ఈ ప్రాంతానికి రావడం ఎంతో శుభ పరిణామం అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు ఎంపీ తెలిపారు.ముఖ్యంగా పెనుగొండ ప్రాంతం నిత్యం ప్రజలు అనేక పనులకు వెళ్లి రావడం జరుగుతున్నదని, కర్ణాటక ప్రాంతం దగ్గరగా ఉందని అలాగే పెనుగొండలో కూడా పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని అందువల్ల ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక దృష్టిని సారించాలని మంత్రి ని కోరారు. 2018లో తాను పెనుగొండ



ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రస్తుత బ్రిడ్జి నిర్మాణమునకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేశారని ఎంపీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఆర్ డి ఓ ఆనంద్, శ్రీధర్, ఏసీఎం ఉమేష్ నాయక్, టి. ఐ. సతీష్ రెడ్డి, పెనుగొండ రైల్వే స్టేషన్ ఎస్.ఎం. రమణారెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బేబీకి మసాజ్ చేస్తే కండరాలు దృఢంగా తయారవుతాయా!

చలికాలంలో చిన్నపిల్లల చర్మానికి, కండరాలకు సరైన నూనెతో మసాజ్ చేయడం చాలా మేలు చేస్తుంది. కొబ్బరి, ఆవాలు, బాదం , నువ్వులు వంటి సహజ నూనెలు శిశువు సంరక్షణకు సురక్షితమైనవి , ప్రభావవంతమైనవి. కాబట్టి క్రమం తప్పకుండా మసాజ్ చేయడం వల్ల శిశువుకు జలుబు నుంచి రక్షణ లభించడమే కాకుండా వారి ఆరోగ్యానికి, ఎదుగుదలకు కూడా మేలు చేకూరుతుంది. ప్రతి వంట నూనె లేదా ఇతర చర్మ సంరక్షణ నూనెలు కొన్ని ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటాయి. కొబ్బరినూనె కాకుండా చర్మ సౌందర్యాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కొన్ని నూనెలను ఉపయోగిస్తారు. చలికాలంలో కూడా చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడం సవాలే. కాబట్టి పెద్దలకే కాదు, అప్పుడే పుట్టిన పిల్లలు ఉన్న ఇళ్లలో కూడా ఆయిల్ తో మసాజ్ చేయడం వల్ల బిడ్డ చర్మం, కండరాలు ఆరోగ్యంగా ఉంటాయి. సరైన నూనెను ఉపయోగించడం వల్ల చలి నుండి శిశువును రక్షించడానికి చర్మాన్ని మృదువుగా చేయడానికి , దాని శారీరక అభివృద్ధికి సహాయపడుతుంది. కాబట్టి శీతాకాలంలో ఏ నూనెను ఉపయోగించడం మంచిది? శిశువులకు మసాజ్ చేయడానికి ఏది అనుకూలంగా ఉంటుంది? పూర్తి సమాచారం ఇదిగో. కొబ్బరి నూనె: ఈ నూనె చాలా తేలికగా ఉంటుంది , చర్మం ద్వారా సులభంగా గ్రహించబడుతుంది. ఇది యాంటీ బాక్టీరియల్ , యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంది , ఇది చర్మ వ్యాధుల నుండి కూడా రక్షిస్తుంది. చలికాలంలో ఇది చర్మానికి తేమను అందించి దురద నుండి ఉపశమనం కలిగిస్తుంది. మస్టర్డ్ ఆయిల్: ఆవనూనె చల్లని వాతావరణంలో వేడి చేయడానికి చాలా మంచిదని భావిస్తారు. ఇది కండరాలను బలపరుస్తుంది , శిశువు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది.



## టీ, కాఫీ ప్రియులకు గుడ్ న్యూస్!



కాఫీకి, టీకి ఉన్న క్రేజ్ ఎప్పటికీ తగ్గదు. ఉదయాన్నే లేచి కాఫీ లేదా టీ తాగితేనే చాలా మందికి డే స్టార్ట్ అవుతుంది. ఇలా చాయ్ తాగడం చాలా మంది లైఫ్‌లో భాగమైపోయింది. ఒక వ్యక్తి రోజుకు 300 మిల్లీగ్రాముల వరకు కెఫీన్ తీసుకోవచ్చు. సో లిమిటెడ్‌గా కాఫీ తాగితే మంచిదే. తాజాగా చాయ్ ప్రియులకు మరో గుడ్ న్యూస్ వచ్చింది. ఉదయాన్నే వేడి వేడిగా ఓ కప్పు కాఫీ, లేదా టీ పడితేనే రోజుకు గుడ్ స్టార్ట్‌గా చెబుతారు చాలామంది. పొద్దునే టీ లేదా కాఫీ తాగకపోతే ఎంతో లోటుగా ఫీలవుతారు. టీ, కాఫీ తాగనిదే అడుగు ముందుకు పడదంటే అతిశయోక్తి కాదు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదని హెచ్చరించినా కొందరు ఆ అలవాటును మానుకోలేరు. ఇలాంటి వారికి నిజంగా ఇది శుభవార్త అని చెప్పాలి. టీ లేదా కాఫీ తాగే అలవాటు ఉన్నవారిలో తల, మెడ క్యాన్సర్ ముప్పు తగ్గవచ్చని 'క్యాన్సర్ జర్నల్'లో ప్రచురితమైన అమెరికన్ క్యాన్సర్ సొసైటీ రీసెర్చ్‌లో వెల్లడైంది. 'ఇంటర్నేషనల్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ కన్సార్టియం' నిర్వహించిన ఈ రీసెర్చ్‌లో టీ, కాఫీ వల్ల కలిగే బెనిఫిట్స్ తెలుసుకునే ప్రయత్నం చేశారు. పరిశోధకులు దాదాపు 14 రీసెర్చ్‌లకు సంబంధించిన డేటాను విశ్లేషించారు. అంతేకాదు, తల, మెడ క్యాన్సర్‌తో బాధపడుతున్న 9,500 మందికి పైగా రోగులను, క్యాన్సర్ లేని 15,700 మందిని పరీక్షించారు. ప్రతి రోజూ టీ, కాఫీలు తాగేవారిలో తల, మెడ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పరిశోధకులు తేల్చారు. నోరు, గొంతు, స్వరపేటికకు సంబంధించిన క్యాన్సర్లు వచ్చే ముప్పు తక్కువని తేలినట్టు వివరించారు. కాఫీ తాగని వారితో పోలిస్తే రోజూ నాలుగు కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగే వారిలో తల, మెడ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 17 శాతం తగ్గిందని గుర్తించారు. అలాగే, ప్రతి రోజూ కాఫీ తాగేవారిలో 'ఓరల్ కేవిటీ క్యాన్సర్' ముప్పు 30 శాతం, గొంతు క్యాన్సర్ ప్రమాదం 22 శాతం తగ్గుతోందని పరిశోధకులు కనుగొన్నారు. రోజూ 3-4 కప్పుల కాఫీ తాగితే 'హైపోఫారింజియల్ క్యాన్సర్' ముప్పు 41 శాతం తగ్గించవచ్చని, 'ఓరల్ కేవిటీ క్యాన్సర్' ప్రమాదాన్ని 25 శాతం తగ్గించవచ్చని రీసెర్చ్ పేర్కొంది. కెఫిన్ లేని కాఫీ కూడా ప్రయోజనకరమేనని తెలిపింది. కాఫీతో పాటు టీ కూడా హైపోఫారింజియల్ క్యాన్సర్ ప్రమాదాన్ని 29 శాతం తగ్గించడంలో సహాయపడుతుందని వెల్లడించింది. ప్రతిరోజూ ఒక కప్పు టీ తాగితే తల, మెడ క్యాన్సర్ వచ్చే ప్రమాదం 9 శాతం మేర తగ్గుతుందని పేర్కొంది. ఇకహైపోఫారింజియల్ క్యాన్సర్ ప్రమాదాన్ని టీ తాగే అలవాటు దాదాపు 27 శాతం తగ్గించవచ్చని అధ్యయనం పేర్కొంది.

## పాలు ఎక్కువగా తాగితే సమస్యలా?



పాలలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం, కాల్షియం, పొటాషియం, మెగ్నీషయం, విటమిన్ డి, బి 12 వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఒక గ్లాసు పాలు తాగితే మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు ఆరోగ్యాంగా, దృఢంగా ఉండేందుకు పాలు మేలు చేస్తాయి. కానీ, పాలు ఎక్కువగా తాగటం కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. మంచి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన సంపూర్ణ ఆహారంలో పాలు అతి ముఖ్యం.. ఈ విషయం మనందరికీ తెలిసిందే. పుష్కలమైన పోషక విలువలు నిండివున్న పాలు ప్రతి రోజూ తప్పక తాగాలని వైద్య నిపుణులు చెబుతుంటారు. పాలలో ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పొటాషియం, కాల్షియం, పొటాషియం, మెగ్నీషయం, విటమిన్ డి, బి 12 వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఒక గ్లాసు పాలు తాగితే మనలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు ఆరోగ్యాంగా, దృఢంగా ఉండేందుకు పాలు మేలు చేస్తాయి. కానీ, పాలు ఎక్కువగా తాగటం కూడా ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. మోతాదుకు మించి పాలు తాగటం వల్ల కలిగే నష్టలేంటో ఇక్కడ తెలుసుకుందాం..


పాలు ఎక్కువగా తాగడం వల్ల పలు రకాల అనారోగ్య సమస్యలు తప్పవంటున్నారు ఆరోగ్య నిపుణులు. ముఖ్యంగా పాలు ఎక్కువగా తీసుకోవటం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. తిమ్మిరి, ఉబ్బరం, అజీర్ణం, అతిసారం వంటివి ఎదుర్కొవాల్సి వస్తుంది. అలాగే, మీ శరీరం పాలకు అనుగుణంగా లేకుంటే, మీరు దీని కారణంగా పేగు సింద్రోమ్‌కు గురవుతారు. దీని కారణంగా, మీరు అన్ని ఎప్పుడూ నీరసంగా, అలసటగా ఉంటారు. ఎక్కువగా తలనొప్పి సమస్య కూడా వేధించే అవకాశం ఉంది. అంతేకాదు.. పాలు ఎక్కువగా తాగటం వల్ల ముఖంపై మొటిమల సమస్యతో బాధపడాల్సి ఉంటుంది.. ముఖంపై మొటిమలు, మచ్చలు తరచూ వేధిస్తున్నట్టయితే.. మీరు రోజుకు ఎన్ని పాలు తాగుతున్నారో గమనించండి. అలాగే, పాలలో కేలరీలు కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే.. పాలను నివారించాలి.. లేదా చాలా తక్కువగా తీసుకోవాలి. పాలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో ఐరన్ లోపం ఏర్పడుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలు ఇనుము శోషణకు ఆటంకం కలిగిస్తాయి. మీకు రక్తహీనత సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది.

## ఈ జ్యూస్ వారానికి 3 గ్లాసులు తీసుకుంటే చాలు..!

తెలుగులో బేరీపండుగా పిలిచే పియర్ ఫ్రూట్ రుచిలో ఎంతో మధురంగా ఉండటమే కాదు. ఈ పండులో అద్భుతమైన పోషకాలు నిండివున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లుగా ఉంటాయి. అయితే, వారానికి 3గ్లాసులు పియర్‌ఫ్రూట్ జ్యూస్ తీసుకోవటం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకోండి. పియర్ ఫ్రూట్.. ఈ పండు ఆరోగ్యానికి చాలా మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇది అనేక రకాల వ్యాధుల నుండి రక్షిస్తుంది. ఇందులో విటమిన్ సి, కార్బోహైడ్రేట్, ఫైబర్, కాపర్, జింక్, పొటాషియం, కాల్షియం మొదలైన పోషకాలు పియర్‌ఫ్రూట్‌లో పుష్కలంగా ఉన్నాయి. పియర్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది ప్రేగు కదలికలో సహాయపడుతుంది. మలబద్ధకంతో బాధపడుతుంటే, వారానికి రెండు మూడు సార్లు పియర్ ఫ్రూట్ లేదంటే జ్యూస్ తాగిన కూడా మంచిలి ఫలితాలు పొందుతారని చెబుతున్నారు. ఈ పండు మలబద్ధకం, మధుమేహం సమస్యలకు దివ్యౌషధంగా పనిచేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇది చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పియర్‌లో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇందులో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది అధిక రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. పియర్‌ఫ్రూట్‌ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో ఫైబర్, ప్రొటీన్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారు రోజువారీ ఆహారంలో ఈ పండ్లను చేర్చుకోవచ్చు.



## మటన్ కీమా ఇగురు ఇలా చేయండి!



మటన్ కీమాతో ఎన్నో రెసిపీ తయారు చేసుకోవచ్చు. ఎక్కువగా స్నాక్ ఐటెమ్స్ తయారు చేస్తూ ఉంటారు. మటన్ కీమా చాలా రుచిగా ఉంటుంది. మటన్ కీమాను చాలా తేలికగా వండుకోవచ్చు. మటన్ కంటే మటన్ కీమా రుచే బాగుంటుంది. చపాతీ వంటి వాటితో తిన్నా, వేడి వేడి అన్నంలో వేసుకుని తిన్నా రుచి వేరే లెవల్‌లో ఉంటుంది.. నాన్ ప్రియులకు ఎంతో ఇష్టమైన వాటిల్లో మటన్ కీమా కూడా ఒకటి. మటన్ కీమాతో ఎన్నో రెసిపీ తయారు చేసుకోవచ్చు. ఎక్కువగా స్నాక్ ఐటెమ్స్ తయారు చేస్తూ ఉంటారు. మటన్ కీమా చాలా రుచిగా ఉంటుంది. మటన్ కీమాను చాలా తేలికగా వండుకోవచ్చు. మటన్ కంటే మటన్ కీమా రుచే బాగుంటుంది. చపాతీ వంటి వాటితో తిన్నా, వేడి వేడి అన్నంలో వేసుకుని తిన్నా రుచి వేరే లెవల్‌లో ఉంటుంది. ఈ పద్దతిలో చాలా సింపుల్‌గా మటన్ కీమా వండేయవచ్చు. మరి మటన్ కీమా ఎలా తయారు చేస్తారు? ఈ రెసిపీకి కావాల్సిన పదార్థాలు ఏంటో ఇప్పుడు చూడండి.

బిజినెస్

## దేశంలోనే అతి పెద్ద ఐపీవోకు రంగం సిద్ధం.. త్వరలో రానున్న రిలయన్స్ జియో




రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కు చెందిన టెలికాం విభాగమైన రిలయన్స్ జియో త్వరలో ఐపీవోకు రానుంది. దీనికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముఖేష్ అంబానీ ఈ ఐపీవో ద్వారా రూ.35 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు సేకరించాలని భావిస్తున్నారు. ఈ ఏడాది రెండో టర్మ్ తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజ్ లో లిస్ట్ అవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకూ జరిగిన ఐపీవోలలో హ్యుందాయ్ మోటార్స్ అతి పెద్దదిగా రికార్డు సాధించింది. 2024 అక్టోబర్ లో జరిగిన ఐపీవోలో రూ.27,870 కోట్లు సమీకరించింది. ఆ తర్వాత స్థానంలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నిలిచింది. 2022లో ఈ సంస్థ రూ.21 వేల కోట్లు సాధించింది. ఇప్పుడు రిలయన్స్ జియో రూ.40 వేల కోట్ల నిధుల సేకరణ కోసం ఐపీవోకు రానుంది. దేశంలోని టెలికమ్యూనికేషన్ కంపెనీలలో రిలయన్స్ జియో ఒకటి. దీనికి దేశంలో 46 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇండస్ట్రీస్ టెలికాం, ఇంటర్నెట్, డిజిటల్ వ్యాపారాల కోసం ఐదేళ్లలో రూ.26 వేల కోట్లు పెట్టుబడి పెట్టింది. అక్టోబర్ చివరి నాటికి కంపెనీకి 47 కోట్ల వైర్ లెస్ కస్టమర్ బేస్ ఉంది. గతేడాది జూన్ లో టారిఫ్ ల పెరుగుదల కారణంగా సెప్టెంబర్ త్రైమాసికంలో లాభంలో పెరుగుదల కనిపించింది. రిలయన్స్ జియో సంస్థ లాభాల బాటలో పయనిస్తోంది. దీనికి నికర లాభం వార్షికంగా 14 శాతం పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండో త్రైమాసికంలో రూ.6,231 కోట్లు సంపాదించింది. కంపెనీ వార్షికాదాయం ఏడు శాతం పెరిగి రూ.28,338 కోట్లకు చేరింది. జూలై %-% సెప్టెంబర్ చివరిలో రూ.26,478 కోట్ల ఆదాయం వచ్చింది. జియో వార్షిక ఈబీఐటీడీఏ 8 శాతం పెరిగి, రూ.15,036 కోట్లు సాధించింది. దీనికి ముందు 53.1 శాతం మార్జిన్ తో రూ.13,920 కోట్లుగా ఉంది. రిలయన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వ్యాపారాన్ని 2023లో జాబితా చేశారు. అదే ఏడాది జూలైలో దాని మూల సంస్థ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఐ) నుంచి విడిపోయింది. ఆ తర్వాత జియో ఫైనాన్షియల్ షేర్ ధర డిస్కవరీ మోకానిజం కింద రూ.261.85గా నిర్ణయించారు. అనంతరం అక్టోబర్ 21న కంపెనీ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో రూ.265 వద్ద లిస్ట్ అయ్యాయి. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లో రూ.262కు జాబితా చేశారు. అనంతరం ఇవి రూ.304 వరకు పెరిగాయి.

## డబ్బులు పంపడానికి ఉత్తమ పద్ధతులు ఇవే..

# చార్జీల బాదుడు నుంచి విముక్తి

నిర్దిష్ట లావాదేవీల తర్వాత చార్జీలను వసూలు చేస్తున్నాయి. దీంతో ప్రజలు బ్యాంక్ యాప్ లు, ఎన్ఈఎఫ్ టీ చెల్లింపులపై ఆసక్తి చూపుతున్నారు. బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులను ఎలా పంపాలి. దానికి విధించే చార్జీలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. దానిలో భాగంగా బ్యాంకు ఖాతాల్లోని రకాల గురించి తెలుసుకుందాం.

**పొదుపు ఖాతా**

వ్యక్తిగత ఉపయోగాల కోసం తెరిచే ఖాతాను పొదుపు ఖాతా అంటారు. దీనిలో డబ్బుకు స్థిరమైన వడ్డీరేటు అందుతుంది. దీని ద్వారా డబ్బులను ఉచితంగా బదిలీ చేయవచ్చు. లేకపోతే పరిమిత చార్జీలు విధిస్తారు.

**కరెంట్ ఖాతా**

వ్యాపారులు, వివిధ రంగాల నిపుణులకు ఈ ఖాతా ఉపయోగపడుతుంది. ఈ ఖాతాకు లావాదేవీల పరిమితి లేదు. కానీ డబ్బును బదిలీ చేస్తే చార్జీలు వర్తిస్తాయి. ఉద్యోగం చేస్తున్న వారికి జీతం ఖాతాలను తెరుస్తారు. ప్రతి నెలా వారికి వచ్చే జీతం దీనిలో జమ అవుతుంది, ఈ ఖాతా ద్వారా డబ్బులు బదిలీ చేస్తే చార్జీలు ఉండవు. అవసరమైన చాలా పరిమితంగా విధిస్తారు.

**ఎన్ఆర్ఐ ఖాతా**

విదేశీ పౌరులు, దేశం వెలువల నివసిస్తున్న వారికి ఈ ఖాతా ఇస్తారు. విదేశాల నుంచి మన దేశానికి వీటి ద్వారా డబ్బులను పంపవచ్చు.

**చార్జీలు ఇలా**




ఎన్ఈఎఫ్ టీ (నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్ ఫర్). ఈ విధానంలో చిన్న, పెద్ద మొత్తాలలో డబ్బులను పంపవచ్చు. ఈ లావాదేవీలకు బ్యాంకుల వారీగా చార్జీలు విధిస్తారు. అవి ఒక్క రూపాయి నుంచి రూ.25 వరకూ ఉంటాయి.

ఆర్టీజీఎస్ (రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్స్) ఈ విధానంలో రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తాల లావాదేవీలు జరపవచ్చు. వీటి చార్జీలు రూ.25 నుంచి రూ.52 వరకూ ఉంటాయి.

ఐఎంపీఎస్ (తక్షణ చెల్లింపు సేవ) అత్యవసర లావాదేవీల కోసం ఈ విధానంలో డబ్బులను పంపుతారు. ఈ సర్వీసు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. లావాదేవీ చార్జీలుగా రూ.5 నుంచి రూ.15 వరకు వసూలు చేస్తారు.

యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్) ఈ విధానంలో చిన్న లావాదేవీలను ఉచితంగా చేసుకోవచ్చు. ప్రీమియం లావాదేవీలకు మాత్రం చార్జీలు విధించే అవకాశం ఉంది.

క్లాసిక్ చెక్ ట్రాన్స్ ఫర్ చెక్ ద్వారా నగదు బదిలీ చేస్తే డిజిటల్ చార్జీ విధించరు.

ఆర్థిక లావాదేవీలు నిర్వహించేటప్పుడు డబ్బులను ఆదా చేయడానికి అనేక పద్ధతులు ఉన్నాయి. వాటిని ఉపయోగించి ఉచితంగా సేవలు పొందవచ్చు. దానికోసం కొన్ని చిట్కాలు పాటించాలి

**యూపీఐ, ఐఎంపీఎస్**

చిన్న లావాదేవీలు నిర్వహించడానికి యూపీఐ, ఐఎంపీఎస్ విధానాలు ఉపయోగంగా ఉంటాయి. వీటి ద్వారా ఉచితంగా డబ్బులను పంపవచ్చు. చార్జీలు విధించినా నామమాత్రంగానే ఉంటాయి.

**డిజిటల్ యాప్ లు**

వివిధ బ్యాంకులు తమ డిజిటల్ చెల్లింపు యాప్ లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. వీటి ద్వారా లావాదేవీలు జరిగితే డిస్కౌంట్లు కూడా పొందవచ్చు.

**బ్యాంకు నిబంధనలు**

బ్యాంకుల నిబంధనలను బట్టి లావాదేవీల చార్జీలు మారుతూ ఉంటాయి. కాబట్టి బ్యాంకు విధించే చార్జీలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలి.

# గతవారం ట్రేడింగ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు భారీ నష్టం

## టాప్ -10లో నాలుగు సంస్థల ఎం-క్యాప్ రూ.19,605 కోట్లు వృద్ధి

గతవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ ముగిసిన తర్వాత బీఎస్ఈ-30 లిస్టెడ్ కంపెనీల్లోని టాప్ 10 కంపెనీల్లో నాలుగు కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.96,605.66 కోట్లు కోల్పోయాయి. వాటిల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) భారీగా నష్టపోయాయి. మరోవైపు, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, ఐటీసీ, భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్) లాభ పడ్డాయి. టాప్-10 సంస్థల్లో మిగతా ఆరు సంస్థలు తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.82,861.16 కోట్లకు పెంచుకు న్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.37,025.46 కోట్లు పతనమై రూ.13,37,919.84 కోట్లకు చేరుకున్నది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం-క్యాప్ రూ.29,324.55 కోట్ల నష్టంతో రూ. 8,93,378.50 కోట్ల వద్ద స్థిర పడింది. టీసీఎస్ ఎం-క్యాప్ రూ.24,856.26 కోట్లు కోల్పోయి రూ.14,83,144.53 కోట్లకు పరిమితమైంది. భారతీయ




స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ) ఎం-క్యాప్ రూ. 5,399.39 కోట్ల పతనంతో రూ.7,08,168.60 కోట్లకు చేరుకున్నది. మరోవైపు, రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.41,138.41 కోట్ల వృద్ధితో రూ.16,93,373.48 కోట్ల వద్ద ముగిసింది. హిందూస్థాన్ యూనీ లివర్ ఎం-క్యాప్ రూ.15,331.08 కోట్లు పెరిగి రూ.5,65,194.18 కోట్లకు చేరుకుంది. ఎల్ఐసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.13,282.49 కోట్లు పెరిగి రూ.5,74,689.29 కోట్ల వద్ద నిలిచింది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ.9,031.19 కోట్లు వృద్ధి చెంది 8,04,834.34 కోట్ల వద్ద ముగిసింది. ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3,878.63 కోట్లు పెరిగి రూ.6,03,064.44 కోట్ల వద్ద నిలిచింది. భారతీ ఎయి టెల్ ఎం-క్యాప్ రూ.199.36 పెరిగి రూ.9,10,934.58 కోట్లకు సరిపెట్టుకుంది. గత వారం ట్రేడింగ్ ముగిసిన తర్వాత టాప్ టెన్ సంస్థల్లో రిలయన్స్ మొదటి స్థానంలో కొనసాగుతున్నది. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీ బ్యాంకు, హిందూస్థాన్ యూనీ లివర్ నిలిచాయి.

స్పోర్ట్స్

## వరుసగా రెండోసారి..

# డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా

**హైదరాబాద్:** పదేండ్ల తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని గెచుకున్న ఆస్ట్రేలియా.. వరుసగా రెండో సారి డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరింది. జూన్‌లో జరిగే ఫైనల్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఇంగ్లాండ్‌లోని లార్డ్స్ వేదికగా గద కోసం పోరాడనున్నాయి. రెండేండ్ల క్రితం జరిగిన ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా ట్రోఫీని ముద్దాడింది. కాగా, సిడ్నీ వేదికగా జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ చివరి మ్యాచ్‌లో ఆసీస్ ఘన విజయం సాధించింది. భారత్ విధించిన 162 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా (41), కొన్‌స్టాప్ (22) భారత బౌలర్లపై తొలి నుంచే ఎదురుదాడికి దిగారు. దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని తగ్గించేకు ప్రయత్నించారు. వారిద్దరూ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్, స్టీవ్ స్మిత్ ఆకట్టుకోలేకపోయారు. అయితే ట్రావిస్ హెడ్ (34), వెబ్‌స్టర్ (39) మరో వికెట్ పడకుండా అడ్డుకున్నారు. ఆచితూచి ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చారు. దీంతో పదేండ్ల తర్వాత బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా 3-1 తేడాతో గెలుపొందింది. 2016-17 నుంచి 2022-23 మధ్య నాలుగుసార్లు భారత్ ఈ ట్రోఫీని సొంతం చేసుకున్నది. ఇప్పుడు బీజీటీ సిరీస్‌లో ఓడింది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియాకు ప్రపంచ టెస్ట్



చాంపియన్‌షిప్ ఆశలు గల్లంతయ్యాయి. 2023-25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో భారత్‌కు ఇదే చివరి మ్యాచ్. సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓడిపోయింది. దీంతో 2021, 2023లో డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరిన భారత్ ఈసారి అర్హత సాధించలేకపోయింది.

## ఆస్ట్రేలియాలో బుమ్రా అరుదైన ఘనత.. సిరీస్ పోయినా, ఆ విషయంలో మనోడే గ్రేట్

ఈ సిరీస్‌లో, ఆసియా ఆటగాడిగా అత్యధికంగా 5 వికెట్లు తీసిన సెనా దేశాలలో మూడో బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. సేనా దేశంలో అతను 9 సార్లు ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు ఈ జాబితాలో అతని కంటే ముత్తయ్య మురళీధరన్, వసీం అక్రమ్ మాత్రమే ముందున్నారు. సేనా దేశాల్లో ముత్తయ్య మురళీధరన్ 10 సార్లు, వసీం అక్రమ్ 11 సార్లు 5 వికెట్లు తీశారు. అంటే, గత టెస్టులో గాయం కారణంగా చివరి ఇన్నింగ్స్‌లో బౌలింగ్ చేయలేకపోయినప్పటికీ, ఈ పర్యటన బుమ్రాకు అనేక విధాలుగా మేలు చేసింది. అదే సమయంలో, ఒక భారత బౌలర్ విదేశాల్లో ఆడిన టెస్ట్ మ్యాచ్‌ల్లో ఇన్ని వికెట్లు తీయడం కూడా ఇదే మొదటిసారి. దీంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అత్యధిక వికెట్లు తీసిన భారత రికార్డును జస్ప్రీత్ బుమ్రా సమం చేశాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా కూడా జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. బిషన్ సింగ్ బేడీ పేరిట ఉన్న 47 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. 1977-78లో ఆస్ట్రేలియాలో జరిగిన టెస్టు సిరీస్‌లో బేడీ 31 వికెట్లు తీశాడు.



జస్ప్రీత్ బుమ్రా ఈ సిరీస్‌లో అత్యంత విజయవంతమైన బౌలర్. 5 మ్యాచ్‌ల్లో మొత్తం 32 వికెట్లు తీశాడు. ఈ కాలంలో అతని సగటు 13.06గా నిలిచింది. ఈ సిరీస్‌లో, బుమ్రా ఒక ఇన్నింగ్స్‌లో మూడుసార్లు 5 వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. రెండుసార్లు ఒక ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసుకున్నాడు. బుమ్రాతో పాటు, బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో ఏ బౌలర్ కూడా 25 వికెట్ల మార్కును దాటలేకపోయాడు. ఈ సిరీస్‌లో 25 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా పాట్ కమిన్స్ నిలిచాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో టీమిండియా 1-3 తేడాతో ఓడిపోయింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచినా.. ట్రోఫీని టీమిండియా నిలబెట్టుకోలేకపోయింది. కానీ భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు ఈ సిరీస్ చాలా ప్రత్యేకమైనది. అతను ప్రతి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో పాటు అత్యధిక వికెట్లు పడగొట్టాడు. కానీ అతనికి ఇతర ఆటగాళ్ల నుంచి మద్దతు లభించలేదు. ఈ సిరీస్‌లో టీమిండియా ఓడిపోయినప్పటికీ బుమ్రాకు ఈ సిరీస్‌లో అతిపెద్ద అవార్డు దక్కింది. అంటే, అతను తన చిరస్మరణీయ ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా ఎంపికయ్యాడు.

## టీ20ల్లో హీరోలు.. వన్డే, టెస్ట్‌ల్లో విలన్లు..

### వరుస పరాజయాలతో గంభీర్ ఆగమాగం.. ఛాంపియన్స్ ట్రోఫీపై ఎఫెక్ట్



టీం ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ మార్గదర్శకత్వంలో భారత జట్టు ఇప్పటివరకు 19 మ్యాచ్‌లు ఆడింది. ఈ 19 మ్యాచ్‌ల్లో భారత జట్టు ప్రదర్శన ఏమాత్రం బాగోలేదు. ఎందుకంటే గంభీర్ సారథ్యంలో టీ20 మ్యాచ్‌ల్లో రాణించినా.. టెస్టు, వన్డే సిరీస్‌లలో టీమిండియా తడబడింది. దీంతో భారత జట్టు ఘోర పరాజయాలను చవిచూసింది. గంభీర్ కోచ్‌గా మారిన తర్వాత భారత్‌కు ఎదురైన ఘోర పరాజయాల పరంపర ఎలా ఉందో ఓసారి చూద్దాం.. గౌతమ్ గంభీర్ కోచ్ అయిన తర్వాత శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో భారత జట్టు ఓడిపోయింది. 27 ఏళ్ల తర్వాత ఇలాంటి ఓటమిని ఎదుర్కొంది. అంటే 2 దశాబ్దాల తర్వాత శ్రీలంక జట్టు భారత్‌తో వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో విజయం సాధించింది. ఈ సిరీస్‌లోని మూడు మ్యాచ్‌ల్లోనూ టీమిండియా చిత్తుగా ఓడిపోవడం, శ్రీలంకతో జరిగిన సిరీస్‌ను ఒక మ్యాచ్‌లో 2-0 తేడాతో (ఒక మ్యాచ్ డ్రా) చేజార్చుకోవడం గమనార్హం. అంటే వన్డే చరిత్రలో తొలిసారిగా 30 వికెట్లు కోల్పోయి 3 వన్డేల సిరీస్‌ను కోల్పోయిన టీమిండియా ఘోర రికార్డును లిఖించింది. శ్రీలంకతో సిరీస్ ఓటమితో, క్యాలెండర్ ఇయర్‌లో విజయం లేకుండానే భారత్ వన్డే సిరీస్ షెడ్యూల్‌ను ముగించింది. 45 ఏళ్లలో భారత జట్టు వన్డే మ్యాచ్‌లో విజయం సాధించకుండా ఏడాదిని ముగించడం ఇదే తొలిసారి. బెంగళూరు టెస్టు మ్యాచ్‌లో టీమిండియా ఓడిపోవడంతో న్యూజిలాండ్ జట్టు 36 ఏళ్ల తర్వాత భారత్‌లో టెస్టు మ్యాచ్‌లో విజయం సాధించింది. దీంతో చిన్నస్వామి స్టేడియంలో భారత జట్టు 19 ఏళ్ల విజయోత్సవానికి కూడా తెరపడింది. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా 46 పరుగులకే ఆలౌటైంది. స్వదేశంలో టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు సాధించిన అత్యల్ప స్కోరు ఇదే. 92 ఏళ్ల టెస్టు చరిత్రలో న్యూజిలాండ్‌పై భారత్ ఓడిపోవడం ఇదే తొలిసారి. అంటే గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో టీమిండియా కివీస్‌పై ఓటమికి తెర తీసిందన్నమాట. న్యూజిలాండ్‌తో సిరీస్ ఓటమితో స్వదేశంలో భారత జట్టు 12 ఏళ్ల విజయ పరంపరకు తెరపడింది. అలాగే 12 ఏళ్ల తర్వాత టీమ్ ఇండియా వరుసగా టెస్టు మ్యాచ్ ల్లో ఓడి నిరాశపరిచింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో 19 ఏళ్ల టెస్టు విజయాల పరంపరకు తెరపడడమే కాదు, ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఓటమితో 12 ఏళ్ల విజయ పరంపరకు తెరపడింది. మరీ ముఖ్యంగా స్వదేశంలో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-0 తేడాతో ఓడిపోవడం 92 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇదే తొలిసారి. అంటే గతంలో ఎన్నడూ లేని విధంగా స్వదేశంలో టీమిండియా ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇప్పుడు బోర్డర్-గవాస్కర్ ఆస్ట్రేలియాతో 10 సంవత్సరాల తర్వాత టెస్ట్ సిరీస్‌ను కోల్పోయింది. గత నాలుగు సిరీస్‌లలో విఫలమైన టీమిండియా ఈసారి 3-1 తేడాతో ఘోరంగా ఓడిపోయింది. ఈ ఘోర పరాజయంతో భారత జట్టు తొలిసారిగా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. ఇంతకుముందు, టీమ్ ఇండియా 2021, 2023లో %ఔఱజ% ఫైనల్ ఆడింది. కానీ, టెస్టు క్రికెట్‌లో పటిష్టమైన జట్టుగా గుర్తింపు పొందిన భారత జట్టు ఈసారి ఫైనల్‌కు చేరకపోవడం విడ్డూరం.



# హాట్ లుక్‌లో పొలిమేర నటి కామాక్షి భాస్కర్ల

పొలిమేర ఫ్రాంచైజీతో నటిగా సూపర్ పాపులారిటీ తెచ్చుకుంది హైదరాబాదీ ముద్దుగుమ్మ కామాక్షి భాస్కర్ల ఈ భామ విరూపాక్ష, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఓం భీమ్ బుష్ సినిమాలతో మంచి పాపులారిటీ సంపాదించుకుంది. 'సైతాన్' వెబ్‌సిరీస్‌లో బోల్డ్‌గా నటించి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచిన ఈ భామ బోల్డ్ క్యారెక్టర్లు చేయడానికి రెడీ. అమాయక పాత్ర అయినా, బోల్డ్ క్యారెక్టర్ అయినా నటికి ఒకటేనని.. కథానుగుణంగా పాత్ర ఉంటుందంటూ దర్శకనిర్మాతల దృష్టిని తనవైపునకు తిప్పుకుంటోంది. పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలు చేస్తూ నటిగా తనను తాను నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్న ఈ భామ తాజాగా హాట్ లుక్‌లో కనిపిస్తూ కుర్రకారుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మోడ్రన్ వేర్‌లో హొయలుపోతూ కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు నెటిజన్లను కట్టిపడేస్తున్నాయి.


## సినిమాల్లోకి అకీరా నందన్ ఎంట్రీ


పెళ్లి, పిల్లల తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న రేణూ దేశాయ్ 2023 లో రవితేజ టైగర్ నాగేశ్వర రావు సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చింది. ఇందులో ఆమె పాత్రకు మంచి పేరు వచ్చింది. దీంతో రేణు మళ్లీ సినిమాల్లో బిజీ అవుతుందనుకున్నారు. అయితే అలాంటిదేమీ జరగలేదు. టైగర్ నాగేశ్వర రావు విడుదలై ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకు ఏ కొత్త సినిమాను అనౌన్స్ చేయలేదీ అందాల తార. ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాలతో రేణూ దేశాయ్ బిజి బిజీగా ఉంటోంది. అనాథ పిల్లలు, పర్యావరణం, మూగ జీవాల సంరక్షణ కోసం తన వంతు కృషి చేస్తుంటుంది. అలాగే తన ఫాలోవర్స్‌ని కూడా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుతూ ఉంటుంది. ఇటీవలే మూగ జీవాల కోసం తన కూతురు ఆద్య పేరు మీదగా ఒక ఎన్‌జీవోను కూడా స్థాపించింది రేణూ దేశాయ్. కాగా చాలా రోజుల తర్వాత విజయవాడకు వచ్చిన ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొంది. మొదట ఇంద్ర కీలాద్రి అమ్మారిని దర్శించుకున్న ఆమె సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొంది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమానికి కూడా హాజరయ్యిందామె. ఈ సందర్భంగా రేణూ దేశాయ్ కు ఒక ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. 'మీ కుమారుడు అకీరా నందన్ సినిమాల్లోకి ఎప్పుడు వస్తున్నాడు' అని రేణూను అడిగారు. దీనికి స్పందించిన ఆమె.. ' ఈ సమయం కోసం నేను కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఒక తల్లిగా మీ అందరికంటే నాకే ఎక్కువ ఆసక్తి ఉంటుంది. అతను ఎప్పుడు ఓకే అంటే అప్పుడే. అకిరా నందన్ ఇష్టంతోనే సినిమాల్లోకి రావాలి. అంతవరకు వెయిట్ చేయండి' అని చెప్పుకొచ్చింది రేణూ దేశాయ్. కాగా పవన్ కల్యాణ్ నటిస్తోన్న ఓజీ సినిమాలో అకీరా నందన్ నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుజిత్ తెరకక్కిస్తోన్న ఈ గ్యాంగ్ స్టర్ యాక్షన్ డ్రామాలో పవన్ చిన్నప్పటి రోల్ అకీరా పోషిస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.



## షాహిద్ కపూర్ 'దేవా' టీజర్ రిలీజ్

బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం దేవా  బిగ్ బీ అమితాబ్ బచ్చన్ దేవా సినిమాను ప్రేరణగా తీసుకుని ఈ చిత్రం రూపొందుతుండగా.. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రోస్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. పూజ హెగ్డే, పావేల్ గులాటి తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జనవరి 31న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. టీజర్ చూస్తుంటే.. షాహిద్ రూత్‌లెస్ పోలీస్‌గా అలరించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా ఈ టీజర్‌ను మీరు చూసేయండి.



## బాలకృష్ణ 'డాకు మహారాజ్' ట్రైలర్ రిలీజ్

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం డాకు మహారాజ్ వాల్తేరు వీరయ్యతో గతేడాది బ్లాక్ బస్టర్ అందుకున్న బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్‌లో బాలయ్య డాకు మహరాజ్ పాత్రతో పాటు నానాజీ అనే డ్యూయల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఫుల్ యాక్షన్ వోల్టేజీతో ఉన్న ఈ ట్రైలర్ చూస్తుంటే బాలయ్య మరో హిట్ కొట్టబోతున్నాడని తెలుస్తుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com